## పశ్చాత్తాప ప్రార్థన

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప దుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పనికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును

పలికిన ప్రతి అనృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.


Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2006-08, Dt.25-8-2006


# మెహెర్‌బాబా


అవతార్ మెహెర్ బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి : 7 సంచిక:2 హైదరాబాద్ మార్చి 2008 పేజీలు: 40

Please visit us @ www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ. 100/-

# చెన్నైలో రెండ్రోజుల సహవాస్

చెన్నైలో మే 3,4 తేదీలలో మెహెర్‌బాబా ప్రేమికుల సహవాస్ ఏర్పాటుచేశారు. మెహెర్‌బాబా చెన్నై నగరాన్ని మూడు దఫాలుగా,

1930 మార్చి 2-4 తేదీలలో, 1934 ఫిబ్రవరి 17-19 తేదీలలో, 1947 ఏప్రిల్ 2-5 తేదీలలో పర్యటించారు. మెహెరాబాద్ తర్వాత ఏర్పాటు చేసిన తొలి బాబా సెంటర్ చెన్నైలోనేనని గమనించాలి. మెహెర్‌బాబా తొలి పర్యటన సందర్భంగా, చెన్నైలోని సైదాపేట, బ్రాహ్మణవీధిలో మెహెర్‌బాబా సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెన్నైయ్‌లో బాబాను అమితంగా ఆరాధించే ప్రముఖ న్యాయమూర్తి శ్రీ సంపత్ అయ్యంగార్, ఆయన కుటుంబీకులు- అవతారునికి, ఆయన మండలి సభ్యులకి ఆతిథ్యం ఇచ్చారు.

1947లో బాబా పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజా దర్శనంలో Grand old Man of Andhra గా అవతారుడ్ని ఆంధ్రులకు పరిచయం చేసారన్న కీర్తిగడించిన డా॥ తోట ధనపతి రావు నాయుడు మెహెర్ బాబాను ఇక్కడే దర్శించుకున్నారు.

చెన్నైలోని సైదాపేట మెహెర్‌సెంటర్‌నే Temple of Silence అని వ్యవహరిస్తారు. ఆనాడు అవతారుడు ఇక్కడ నాటిన రావి మొక్క నేడు- విశాలమైన వట వృక్షంగా దర్శనమిస్తోంది.

చాలాకాలం విరామం తర్వాత పెద్ద ఎత్తున చెన్నైలో ఏర్పాటు చేసిన ప్రేమిక సహవాస్‌లో బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని స్థానిక బాబా ప్రేమికులు కోర్తున్నారు

మరిన్ని వివరాలకు Sri J. Srini Baba,

Kalaranjani School of Music,

Flat -C, No.53, AVM Avenue, Ist Main Road, Virugambakkam, Chennai-600 092, email: srinimusic@ gmai.com, Ph: 09841195273, లేదా: 044-22483288, 09841081091 సంప్రదించగలరు. పాల్గొనబోయే వారి వివరాలు ముందుగా పంపగలితే తగిన ఏర్పాట్లు నిర్వాహకులు చేయగలరు.

త్వరలో మీ ప్రయాణం ఖరారు చేసుకోండి.

## కామారెడ్డి, చల్లపల్లి, చోడవరం బాబా సెంటర్లలో

అవతారుని 114వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపినట్లు ఈమని నరసింహా మూర్తి, ప్రాత రవి కుమార్, పి.వి. రమణ రావు ఒక లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా ధుని వెలిగించుట, సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, ప్రార్థన, హారతి, నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.





# లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. మహా గొప్ప సహవాస్ 6-23
3. లార్డ్ మెహెర్ 24-26
4. బాటసారులు 28-29
5. మా మాటలు
   అవతార్ మెహెర్‌బాబా 114వ జన్మదినోత్సవ వేడుకలపై స్థానిక సెంటర్ నుండి వచ్చిన సంక్షిప్త సమాచారం 30-36
6. మెహెర్ శతకము 37
7. జీవిత సభ్యులు 38


## మెహెర్‌బాబా సందేశం

**మతమన్నది ఓ పంజరం-బోను-వంటిదన్నారు మెహెర్‌బాబా. మనమందరం ఆ బోనులో చిక్కుకున్న పక్షులమన్నారాయన. మతం మారితే ఫలితం శూన్యం. ఎందుకంటే మీరు ఒక బోనులో నుంచి మరో బోనుకి వెడుతున్నారు తప్ప మరేం చేయటంలేదని ఆయనన్నారు.**


గౌరవ సంపాదకులు

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**040-27860079**

వ్యవస్థాపకులు:

**దశిక ప్రసాదరావు**

040-65699611

040-64542370


### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీ పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# ముటుకూరు

ముటుకూరు ఓ చిన్ని గ్రామం. గుంటూరు జిల్లా దుర్గి మండలంలో వుంది. పల్నాటి సీమగా- మెట్ట ప్రాంతంగానూ చెప్పాలి. నిత్యం గ్రామమంతా మెహెర్‌బాబా నామంతో మారు మ్రోగుతుంది. రోజు మొత్తంలో ప్రతి ఒక్కరూ ఏదో క్షణాన **జై మెహెర్‌బాబా** అంటూ ఒకరినొకరు పలకరించుకుంటారు. హమీర్‌పూర్ వాసులను పోలిన మర్మంఎరుగని ప్రేమ వీరిలో కనపడుతుందని ప్రతీతి.

స్థానిక పెద్దలు- ముటుకూరు మాస్టారుగా చాలామందికి బాగా పరిచయమున్న యాగంటి సుబ్బయ్యగారి ఆధ్వర్యంలో ప్రస్తుతం ఈ గ్రామంలో అవతార్- మెహెర్‌బాబా - ప్రార్థనా మందిర నిర్మాణంకై శ్రీకారం చుట్టారు. భూమి పూజ చేసి రెండు నెలలు కావస్తోంది.

భవన నిర్మాణపు పనులు చురుకుగా సాగుతున్నాయి. సుమారు 10 లక్షల రూపాయల అంచనాతో ప్రారంభించిన ఇక్కడి మెహెర్ నిలయానికి మెహెర్‌బాబా ప్రేమికులు ఆర్థికంగా తోడ్పడి ముటుకూరు మాస్టార్ని ప్రోత్సహించాలని "మెహెర్‌బాబా పత్రిక" విజ్ఞప్తి చేస్తోంది!!

**మరిన్ని వివరాలకు** యాగంటి సుబ్బయ్య, ముటుకూరు, దుర్గిమండలం, గుంటూరు జిల్లా, సంప్రదించగలరు.

# మెహెర్‌మాయ

"మెహెర్‌మాయ" - మెహెరుని సృష్టి. ఇది సామాన్యులు నమ్మలేని నిజం!! మెహెర్‌బాబా ప్రేమికులు అబ్బురపడే వాస్తవం!! ఉత్తరాంధ్రులకు క్రొత్తగా చెప్పేది ఏమీలేదు. చాలా మంది తెలుగు పాఠకులకు మెహెర్‌మాయ గురించి బొత్తిగా తెలియదు!! ఏది ఏమైనా "మెహెర్‌మాయ"తో- మెహెరాబాద్‌లో జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ విషయాలు- విశేషాలు 2008 మార్చి సంచికలో ప్రచురిస్తామన్నాం.

కానీ, మహా గొప్ప సహవాస్ ప్రత్యేక సంచికను మార్చి నెలలో అందిస్తున్న దృష్ట్యా, ఈ ఇంటర్వ్యూ విశేషాలు వచ్చే సంచికలో తప్పక ప్రచురించగలం. అందాక సెలవ్ .

– ఎడిటర్

# హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రిక పోస్టల్ బట్వాడాకు సంబంధించి మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే ఎడిటర్, మెహెర్‌బాబా పత్రిక ఫోన్ నెం.040-27860079, 99595-53218 తో పాటు హైదరాబాద్‌లోని ఈ క్రింది ఫోన్ నెంబర్‌లలో ఎవరినైనా కూడా సంప్రదించగలరు. **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్-94403-65640**





సంపాదకీయం

# మహాగొప్ప సహవాస్

మెహెర్‌బాబా 1958 ఫిబ్రవరి 14 నుండి 26 దాకా రెండు వారాల వ్యవధిలో మెహెరాబాద్‌లో మహా గొప్ప సహవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు వారందర్నీ 1958 ఫిబ్రవరి 22 నుంచి 26 దాకా నిర్వహించిన ఐదురోజుల సహవాస్ కార్యక్రమానికి గుజరాతీయులతో జతచేసి ఆహ్వానించారు. మొదటి విడతలో మరాఠీ- హిందీవార్ని 750 మందికి మించకుండా 1958 ఫిబ్రవరి 14 నుండి 19 దాకా ఉండేలా ఆహ్వానించారు.

అవతార్ మెహెర్‌బాబా మానవరూపధారిగా వచ్చిన భగవంతుడు. ఈ విషయాన్ని ఆయన ఘంటాపథంగా పలు సందర్భాలలో ప్రకటించారు.

భగవంతుని సమక్షంలో ఐదు రోజులు గడపటానికై 'సహవాస్' అవకాశాన్ని ఆనాడు కల్పించారు.

1958 ఫిబ్రవరిలో అవతారుడు నిర్వహించిన ఆనాటి సహవాస్‌కు 2008 ఫిబ్రవరి 14 నాటికి 50 సంవత్సరాలు నిండినాయి. ఆ సందర్భంగా మెహెర్‌బాబా ట్రస్టు ఆ మహా గొప్ప సహవాస్ స్వర్ణోత్సవ వేడుకలను అదే స్ఫూర్తితో ఫిబ్రవరి 15,16,17 తేదిలలో మెహెరాబాద్‌లో నిర్వహించింది.

మెహెరుని సహవాస్‌లో పాల్గొన్న ఆనాటి ప్రేమికులు తమ అనుభవాలను అనుభూతులను విశేషంగా వివరించారు. 1958 ఫిబ్రవరి సహవాస్‌లో పాల్గొన్న అనుభూతి మాకు లభించిందని ఇటీవల మెహెరాబాద్ సహవాస్‌లో పాల్గొన్నవారు తమ అభిప్రాయంగా చాలామంది చెప్పారు.

అవతార్ మెహెర్‌బాబా 15 రోజులపాటు నిర్వహించిన ఆ మహా గొప్ప సహవాస్ స్వర్ణోత్సవ వేడుకలు సందర్భాన 2008 మార్చి **మెహెర్‌బాబా సంచికను** మెహెరాబాద్ సహవాస్ ప్రత్యేక సంచికగా అందిస్తున్నాం.

దయచేసి స్పందించండి!!.

# మహా గొప్ప సహవాస్

**1958 ఫిబ్రవరి 14 నుండి 26 దాకా మెహెరాబాదులో బాబా మహా గొప్ప సహవాస్ నిర్వహించారు. ఆ సహవాస్ స్వర్ణోత్సవ సంబరాలు 2008 ఫిబ్రవరి 15,16,17 తేదీలలో ఘనంగా ముగిశాయి. ఆ వేడుకలపై శ్రీ బి.రామకృష్ణయ్య, హైదరాబాద్ సంక్షిప్తంగా ఇలా తెలియజేస్తున్నారు. దయచేసి పరిశీలించండి.**

2008, ఫిబ్రవరి 15, 16 మరియు 17 తేదీల్లో మెహెరాబాదులో 1958వ సంవత్సరంలో ఈ యుగావతారుడైన మెహెర్‌బాబా నిర్వహించిన సహవాస్ యొక్క స్వర్ణోత్సవాలు నిర్వహించబడ్డాయి. అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి.ట్రస్టు చైర్మన్ భావూకల్చూరీ గారి నేతృత్వంలో గ్రంధాలయకమిటీ వారు ఈ కార్యక్రమాల ప్రణాళికను ఆరుమాసాల క్రిందటనే సిద్ధం చేసి 1958వ సహవాస్‌లో పాల్గొన్న వారి వివరాలను సేకరించి, అన్ని ఏర్పాట్లను చేయించి స్వర్ణోత్సవాలను చక్కగా జరిపించారు. దీనికై ప్రముఖంగా పనిచేసిన వారు– శ్రీ గోకరణ్ శ్రీవాత్సవ్, ఆయన శ్రీమతి ఊర్మిళ.

**15.2.2008** రోజున, అమరతిథి ఉత్సవాలను నిర్వహించిన వేదిక పై నుండే స్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రియతమ అవతార్ మెహెర్‌బాబాకు పూలమాల సమర్పించుకోవడంతో సో॥ జాల్‌దస్తూర్, డాలీ పి దస్తూర్ కార్యక్రమాన్ని బుజావే హారతితో ప్రారంభించారు. రెండు భజన పాటల తర్వాత సో॥ శ్రీధర్ ఖేల్కర్ స్వాగతోపన్యాసం చేసారు. సో॥జాల్ దస్తూర్, ట్రస్టు చైర్మన్ భావూకల్చూరి గారికి, ఆహుతులకు స్వాగతం పలికారు. ఆ తర్వాత భావూ కల్చూరి 1958వ సహవాస్ గురించి మాట్లాడారు. ముగించే ముందు భావూజీ తానింకా 1958 సహవాసపు వివరాలను ప్రారంభించనేలేదని చెప్పారు. సహవాస్ పూర్వాపరాల గురించే ముచ్చటించానని చెప్పారు. సాయంత్రం భజన పాటల తర్వాత 1958 సహవాస్‌లో పాల్గొన్న మహిళా ప్రేమికులతో సహవాస్





విశేషాలను జ్ఞాపకం చేసుకొనే కార్యక్రమం నిర్వహించబడింది. మేం మాట్లాడలేం అనే వారు కూడా చక్కగా మాట్లాడారు. తెలుగు వారి అభ్యర్థన మేరకు సో॥ బాలగోపాల భాస్కరరాజు గారు తెలుగులో వారి సహవాస్ అనుభూతులను స్మరించి అందరితో పంచుకొన్నారు. "నమో మెహెర్ బాబా అవతార్, నమోదేవా" అనే పాటను వారిబృందంతో కలసి ఆలాపించారు. సాయంత్రం 6 గం॥ నుండి 6.30 గం॥ వరకు సమాధి వద్ద ఆరతి జరపబడింది. అందరూ పాల్గొన్నారు. 6.30 నుండి 7.30 గం॥ వరకు మెహెరాకు సంబందించి తీసిన చలన చిత్రాన్ని ప్రదర్శించారు.

**16.2.2008** రోజున బాబాకు పుష్పమాలనర్పించి బుజావే హారతితో రెండవ రోజు కార్యక్రమం ప్రారంభించబడింది. ఈరుచ్ జెస్సావాలా సోదరుడు మెహెర్వాన్ జెస్సావాలా భజన గీతాల అనంతరం ముఖ్యవక్తగా వ్రాసి తీసుకొని వచ్చిన 1958 సహవాస్ వివరాలను పూసగ్రుచ్చినట్లు చదివి వినిపించారు. ఆయన్ని పరిచయం చేస్తూ బాబా స్వయంగా చెప్పినట్లు అతను తలనుండి కాలిగోరు వరకు రత్నంలాంటి వాడని చెప్పారు గోకరన్ శ్రీవాత్సవ్. దానికి సమాధానంగా మెహెర్వావాన్ తాను రత్నాన్ని కాదని, బాబా పాదాల వద్ద ధూళిని మాత్రమేనని దానికి కూడా

అర్హుడను కానేమోనని చెప్పారు. తనకు ఆ కార్యక్రమాలను వర్ణించి చెప్పే భాషరాదని, దేవుని మాటలు దేవునికే తెలియాలని వినయంగా చెప్పారు. ఆ తర్వాత బాబా సోదరుడైన బెహ్రామ్ అల్లుడు జహింగీర్ సుభాడ్‌వాలా మరియు ప్రొఫెసర్ దిగంబర్ గాడేకర్ మాట్లాడారు. బాబా తన సోదరుని కూతురు గుల్నార్‌కు ఏ అర్హతలు, సంపదలేని తనను అమ్మాయి తండ్రి బెహ్రాంకు ఇష్టంలేకున్నా అతడు వేరే సంపన్నుల సంబంధాలను చూపించినా ఎలా నిశ్చయించారో సుభాడ్‌వాలా చెప్పి తన వివాహానికి మరియు జీవితంలో బాబా ఎలా వెన్నంటి ఉన్నారనే విషయాలను వర్ణించి చెప్పారు. ఆ సందర్భంగా ఆయన బాబా చెప్పిన ఈ మాటలను ఉదహరించాడు. "నా ఆధ్యాత్మిక స్థాయి ఎంత ఉన్నతమైనదంటే సృష్టిలో ఎప్పుడైనా ఎక్కడైనా, ఎవ్వరైనా అర్థిసే వారికి నా సహాయం వెంటనే అందుతుందన్నారు".

ప్రొఫెసర్ దిగంబర్ గాడేకర్ తన ప్రసంగంలో ఇలా చెప్పారు. సహవాస్ కార్యక్రమంలో తాను ఒక నోటు పుస్తకంలో అన్ని వివరాలు బాబా చెప్పిన సందేశాలు వ్రాసుకొంటుండగా బాబా గమనించి, జాగ్రత్తగా వ్రాసుకో, మళ్ళీ నా కవసరమైనప్పుడు నిన్నడుగుతాను. అప్పుడన్నీ చెప్పాలి, ఎందుకంటే 60 సంవత్సరాలు నిండాయి కదా అని చమత్కరించారట బాబా! ఇంకొక సందర్భంలో తన తండ్రి రామచంద్ర గాడేకర్ విధేయత గురించిన వివరణ యిస్తూ, "నే నాదేశిస్తే నీ కుమారుని తల నరికి నా పాదముల చెంత సమర్పించగలవా" అని అడిగారట. దానికాయన సంసిద్ధతను వ్యక్తం చేయగా బాబా సంతసించారట. ఆ కుమారుడిని నేనే అని దిగంబర్ గాడేకర్ చెప్పారు. సాయంకాల సమావేశంలో హోషంగ్ దాదా ఛాంజీ, డాలీ సోదరుడు ఫిలి ఇంజనీయర్ సహవాస్ అనుభవాల గురించి ప్రసంగించారు. దాదా ఛాంజీ ప్రసంగంలో వారు తెలుగువారి చెప్పులను ఒక్కక్కటి వేరు చేసి ఎలా దాచి పెట్టారో వారినెలా ఏడిపించారో చెప్పారు. ఈ విషయాన్నే జాల్ దస్తూర్ కూడా చెప్పారు. తెలుగు వారు రాత్రంతా మాట్లాడుతూ, పాడుతూ వారిని నిద్రపోకుండా చేయడంతో వారికి వారు చెప్పులు దొరకకుండా చేశానన్నారు. ఈ విషయంలో బాబా వారిని మందలించి బొంబాయికి తంతి కూడా పంపారని, ఆతర్వాత ఎన్నో సంవత్సరాల తర్వాత బొంబాయి కేంద్ర ప్రారంభ సమయంలో వారి చెప్పులన్నీ పోయాయని ఆనాటి వారి తప్పును ఇంకా మరచి పోలేదని చెప్పారు. సాయంకాలం 5-45 నుండి 6 గంటలవరకు, 90 సంవత్సరాల వయసు గల బాలగోపాల భాస్కరరాజుగారు, ఆయన బృందంలోని 85 సంవత్సరాల వయస్సు గల పారేపల్లి సత్యం, 78 సంవత్సరాల వెంకటాచార్యుల వారు వారి జూనియర్ కథకుల సహకారంతో బుర్రకథాగానం చేసి వారి 309వ ప్రదర్శనను యిచ్చారు. అందరినీ ఆశ్చర్యపరచడమే గాక 1958వ సహవాస్‌లో బాబా ముందు ప్రదర్శించిన తమ బుర్రకథా గానాన్ని జ్ఞాపకం చేసుకొని ఆ సందర్భంగా బాబా చెప్పిన





మాటలను వివరించి అందరినీ ఆశ్చర్యచకితులను చేసారు. బాబా ముందు వారు బుర్రకథ గానం చేస్తూ బాబాజాన్ బాబాను ముద్దు పెట్టుకోవడం, ఉపాసనీ మహారాజు గులకరాతితో కొట్టి నుదుటి పై బాబాజాన్ ముద్దు పెట్టుకొన్న చోటనే గాయపరిచే సన్నివేశాలను వర్ణించుచుండగా వారిని ఆపి ఉపాసనీ కొట్టింది చిన్న గులక రాతితో కాదని, నిమ్మకాయ పరిమాణంలో గల రాతితోనని బాబా చెప్పారట. అలాగే ఆనాటి అనుభూతులను తిరిగి తన స్మరణకు తెచ్చారని ఒక్కక్షణం మౌనంగా ఉండి బాబా సూచించారని సో॥ భాస్కరరాజు గారు చెప్పగా సహవాస్‌లో పాల్గొన్న ప్రేమికులందరు హర్షధ్యానాలతో కరతాళ ధ్వనులు చేసారు. ఆ తర్వాత ప్రార్థన హారతులతర్వాత 1958వ సహవాస్‌కు సంబందించి ప్రత్యేకంగా తయారుచేసిన చలన చిత్రాన్ని ప్రదర్శించారు.

**17-2-2008** రోజున మూడవది మరియు ఆఖరుదైన రోజు ఉదయం కార్యక్రమం గుజరాతీ హారతితో ప్రారంభమైనది. సోదరులు సామ్‌కేరావాలా, నౌసేర్వాన్ అంజర్ "ది గ్లో" ఎడిటర్, జాల్ దస్తూర్ మాట్లాడారు. భజనలు, 1958లో పాల్గొన్న ప్రేమికుల అనుభవాల వివరణలు కొనసాగాయి. 1958 సహవాసపు ప్రత్యేక చలన చిత్ర ప్రదర్శనతో కార్యక్రమాలు ముగిసాయి.

అలా జరిగిన మూడు రోజుల కార్యక్రమాలలో, 1958లో జరిగిన సంఘటనలు,

బాబా చెప్పిన సందేశాలు జ్ఞాపకం చేసుకోవడం జరిగింది. వాటిలోని కొన్ని ముఖ్య సంఘటనలను ముఖ్య సందేశాలను సంక్షిప్తంగా ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

1958వ సంవత్సరంలో సహవాస్ ముఖ్యంగా స్త్రీ ప్రేమికుల కోసం ఏర్పాటు చేయబడినది. అయినా స్త్రీల కంటే ఎక్కువగా పురుషులే వచ్చారు. 1955 సహవాస్‌లో స్త్రీలకు అనుమతి లేనందున వారికోసమే 1958లో సహవాస్‌ను బాబా నిర్వహించారు. స్త్రీలు ఒంటరిగా రాలేని కారణంగా వారికి తోడుగా పురుషులు కూడా రావడానికి అనుమతించారు. ఫలితంగా మగవారే అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంలో భావూజీ హమీర్‌పూర్‌లోను, దేశంలోని యితర ప్రదేశాల్లోను గల పరదా సాంప్రదాయాన్ని వివరిస్తూ ఒకసారి ధగ్‌వాన్‌లో ఒక స్త్రీ బాబా దర్శనానికి వచ్చింది. ఆమె కొంగును ముఖం మీద నుండి బురఖా లాగా ధరించింది. నీ ముఖం కన్పించడం లేదు, నీవెవరో తెలియడం లేదు. ఆ ముసుగును (పరదాను) కొంచెం ప్రక్కకు జరిపివేయమని బాబా కోరారు. ఆమె కొంచెం జరిపీ జరపనట్లు ఆ మేలి ముసుగును జరిపింది అయినా బాబాకు ఆమె ముఖం కనిపించలేదు. బాబా మళ్ళీ అడిగారు కాని ఆమె ముసుగును పూర్తిగా తొలగించ లేదు ఎందుకంటే ఆమె భర్త మిగిలిన మగవారు అక్కడ ఎదురుగా ఉన్నారు. ఆమె భర్త వచ్చి ఆమెను చెంపమీద గట్టిగా కొట్టాడు. అలా ఎందుకు కొట్టావని బాబా అడిగారు. బాబా మీ ఆజ్ఞ నామె పాటించడం లేదు అని అన్నాడు. దానికి కారణమెవ్వరో తెలుసా? అని బాబా అడిగారు. నీవే కారణమని మీ మగవారి సమక్షంలో తీయకూడదనే నియమం వల్లనే ఆమె ముసుగు తీయలేదని, అతనికి చెప్పి మందలించారు.

15-2-58 నుండి 19-2-58 వరకు 5 రోజులు హిందీ మరియు మరాఠీ మాట్లాడే బాబా ప్రేమికులతో సహవాసం జరిగింది. 750 మంది వచ్చారు. మొదటి రోజు బాబా అందరికీ తన దర్శనం ఆలింగనం యిచ్చారు. సహవాస్ అంటే ప్రేమ యిచ్చి పుచ్చుకోవడమేనని అందువలన అందరూ తమ సమస్యలను, కుటుంబాన్ని ఇళ్ళను మరచి పోయి తన ప్రేమను గ్రహించి హృదయాలల్లో నింపుకొనండని చెప్పారు. తాను మహాసముద్రడనని ఎంత కావాలంటే అంత ప్రేమను గ్రహించడని చెప్పారు. ప్రార్థనలు, హిందీలో, మరాఠీలో చేయించారు. బాబా స్వయంగా చేతులు కడుగుకొని నిలబడి ప్రార్థనలో పాల్గొన్నారు. పశ్చాత్తాప ప్రార్థన జరిగే సమయంలో చెంపలు గట్టిగా కొట్టుకొంటూ ప్రేమికులుగా, ప్రియతముడుగా రెండు పాత్రలను నిర్వహించి క్షమాభిక్ష అడగడం యివ్వడం రెండు చేశారు.

"నేను నాకే ప్రణమిల్లుతున్నాను, నేను నన్నే ఆలింగనం చేసుకుంటున్నాను, నవ్వుతున్నాను, ఏడుస్తున్నాను, బాబా, బాబా, బాబా అంతా బాబా మయం'' అని జరిగే





సత్యాన్ని బాబా అతి సహజంగా చెప్పారు.

"నేనే మహత్తులను ప్రదర్శించను. మౌన విరమణ చేయడమొక్కటే ఈ అవతారంలో నేను చేసే మహాద్భుతం" శక్తి, ఓపిక నశించిన నా మండలి వారు ఉదా॥ ఈరుచ్, పెందు నేను ప్రతిక్షణం వారికి పెట్టే యాతనల ఫలితంగా ఆరోగ్యం సహకరించకపోయినా ఇన్ని ఏర్పాట్లు వారు చేయడమే ఒక అద్భుతం, అని బాబా చెప్పారు. వచ్చిన వారందరికీ 1958వ సంవత్సరంలోనే బాబా మంచాలు, పరుపులు మంచి భోజన సదుపాయాలు కల్పించారు. వైద్య సహాయం సిద్ధంగా ఉంచారు. 50 సంవత్సరాల తర్వాత ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా బాబా ప్రేమికులకు ఆనాడు బాబా చేయించిన ఏర్పాట్లను, ఈ రోజు మేం చేయలేక పోతున్నాం అని శ్రీమతి డాలీ పి. దస్తూర్ తన ప్రసంగంలో చెప్పారు.

తన విశ్వకార్య భారంతో అసాధారణమైన బాధలను భరించే బాబాకు హాస్యమంటే హాస్యోక్తులంటే ఎంతో యిష్టం. బాబా వద్ద మెహెరాబాదులో ఈరుచ్ మిస్త్రీ అనే శిష్యుడు ఉండేవాడు. అతని పేరును బాబా ఏల్చామిస్త్రీగా, తన మండలి సభ్యుడైన ఈరుచ్

పేరుతో పొరబడకుండా ఉండడానికి, మార్చివేసారు. అతను చాల హాస్యం చేసేవాడు. అతను శ్రీనగర్ నుండి వచ్చాడు. బాబా! మా కాశ్మీర్‌లో ఆలుగడ్డలు చాలా పెద్దవిగా ఒక్కొక్కటి 20 కిలోల బరువుతో ఉంటాయని, అలాగే ఆపిల్స్ ఒక్కొక్కటి ఐదు కిలోల బరువు ఉంటాయని చెప్పేవాడు. బాబా రెండు ఆపిల్స్ తెప్పించమని అతనికి చెప్పారు. తీరా చూస్తే అవి రేగు కాయలకన్నా చిన్నగా ఉన్నాయి. సహవాస్ మొదటి రోజే బాబా అందరిని ఆలింగనం చేసుకున్నారు. మరునాడు ఏల్చామిస్త్రీ వచ్చి బాబా రాత్రి నాకు కలవచ్చింది. కలలో నేను శ్రీనగర్‌కు వెళ్ళాను. తెల్లవారి చూచేసరికి మళ్ళీ మెహెరాబాదులో ఉన్నాను. అందువల్ల ఈరోజే నాకు మీరు ఆలింగనం యివ్వాలి అని అన్నాడు. నీ ఆలోచన బాగుంది. ఆ చమత్కారం నా దగ్గర సాగదు అని బాబా అన్నారు. అయినా ప్రేమతో కరుణతో అతనికి ఆలింగనం యిచ్చారు.

మళ్లీ ఒక ఒకరోజు అతడు స్టేజీ మీద ఉన్న బాబాకు దగ్గరగా వచ్చి బాబా నాకు మీరు ఆలింగనం యిస్తే మీ బాధలన్నీ మాయమై పోతాయని నాకొక సమాచారం అందిదని అన్నాడు. దానికి సమాధానంగా బాబా ఇలా అన్నారు. "బాధలను నేను స్వయంగా ఆహ్వానిస్తాను. బాధలు పడడంలోనే సంతోషిస్తాను. అందుకే వస్తాను. బాధలు పోవాలని నేనుకోరుకోవడం లేదు. అయినా, అతని హాస్యధోరణికి మెచ్చి మళ్ళీ





ఆలింగనం ఇచ్చారు. అలాగే ఒక రోజు బాబా అక్కడే దూరంగా ఉన్న సిద్ధూ గురించి చెప్తూ అతడు టి.బి.తో బాధపడవలసి వస్తుందేమోనని సూచనప్రాయంగా అన్నారు. కొంతసేపటికి సిద్ధూ టీ కప్పుతో స్టేజీ మీదకు వచ్చాడు. అదేమిటని బాబా ప్రశ్నించారు. టీ తెమ్మన్నారు కదా బాబా! అని అన్నాడు. బాబా నవ్వుతూ టీ తెమ్మనలేదు. నీకు టి.బి. వస్తుందేమోనని అన్నాను. అలా అంటూ అతను తెచ్చిన టీ లో కొంత తాను త్రాగి మిగిలిన దాన్ని బాబా తన దగ్గరలో ఉన్నవారికి యిచ్చారు.

" ఆధ్యాత్మిక మార్గంలోని సాధకులకు నేను ఆధ్యాత్మిక సూర్యుణ్ణి. వారికి వెలుగును, ప్రాణాన్ని ప్రసాదిస్తుంటాను. కొద్దిమంది మాత్రం వారిని పూర్తిగా నా ప్రకాశపు తీవ్రతలో దగ్ధం చేసుకుంటారు. మరికొందరు నా కిరణాల వేడితో వెచ్చదనాన్ని మాత్రమే గ్రహించి వాటి తీవ్రతకు దూరంగా ఉండడానికి జాగ్రత్త పడతారు. ఇంకా కొందరు గొడుగును పట్టుకొని ఆ కిరణాలు వారిపై సోకకుండా దూరంగా ఉండి పోతారు" అని బాబా అన్నారు.

బాబా సహవాస్‌కు వచ్చిన వారిలో బాలక్ భగవాన్ అనే ఒక సాధువు వచ్చాడు. అతనికి ఉత్తర భారతంలో చాలామంది శిష్యులున్నారు. అతడు ఎన్నో మహత్తులను చేసేవాడు. బాబా అతనికి ఇతరులతో పాదాభివందనం చేయించుకోవద్దని, ఆ పద్ధతి

మంచిది కాదని పలుమార్లు అతనికి సలహా ఇచ్చారు. అయినా అతడు మానలేదు. సరికదా, ఒకరోజు సహవాస్ మండపం వెనకభాగాన బాలక్ భగవాన్ ఎవరిచేతనో పాదాభివందనం చేయించుకోవడం బాబా చూశారు.

ఆ సందర్భాన్ని పురస్కరించుకొని బాబా నల్లమందు నిషా ఏపాటిదో పాదాభివందనం చేయించుకొనే దొంగ సాధువులకుండే సామ్యాన్ని వివరించి చెప్పారు. నిజమైన ఆధ్యాత్మికానుభవం, అధికారం లేకుండా నేను సాధువునని చెప్పుకుంటూ పాదాభివందనాలు చేయించుకొంటూ ఉంటే అహంకారాన్ని పెంచి పోషించుకుంటూ సంపన్నుడైనట్లు భావిస్తారు. అలాగే నల్లమందుకు అలవాటు పడిన వారు తాత్కాలికంగా అలా సంపన్నుడైనట్లు భావిస్తాడు. అలా కొంతకాలం గడిచాక అతడి మత్తు దాని దుష్ప్రభావానికి ఫలితంగా మలబద్ధకం, తలనొప్పి, ఆకలి లోపించడం, నిస్సత్తువ ఇలా అనేక రుగ్మతలతో బాధపడుతాడు. తన తప్పు చేశానని ఆలస్యంగా తెలుసుకుంటాడు కాని ఆ అలవాటుకు బానిసయైనందున మానలేక పోతాడు. ఇంకా ఎక్కువగా నల్లమందు సేవించడం ప్రారంభిస్తాడు. మత్తు దిగిపోతే కలిగే స్థితిని భరించలేక అధికాధికంగా నల్లమందు సేవిస్తాడు. అలాగే ఆధ్యాత్మికానుభవం లేని దొంగ సాధువు ఇతరుల ప్రణామాలతో గౌరవంతో ఆహంకారాన్ని పెంచి పోషించుకొంటాడు. కొంతకాలం తర్వాత తనకు అధికారం అనుభూతి లేవనే విషయం తెలిసి అంతరంగంలో కొంత తప్పనే భావన కలిగినా ఆ మత్తు కలవాటు పడిపోయినందున నెమ్మదిగా ఆ భావనను పట్టించుకోకుండా విస్మరిస్తాడు. అలా ఇంకా కొంతకాలం గడిచిన తర్వాత నల్లమందు భాయి స్పృహలేకుండా మురుగుకాలువలో పడి కన్పిస్తాడు. ఆపైన ఇక ఎంత మాత్రమైనా నల్లమందు తీసుకుంటే అపాయం. బాటసారులతనిని చూచి అసహ్యించుకొని తిరస్కార భావంతో తూలనాడుతారు. అలాగే దొంగ సాధువు ప్రారంభంలో ఏది చేసినా అతనిని పరిపూర్ణుడుగా భావిస్తూ కొనియాడుతారు. ఎలాంటి తప్పుడు పనులు చేసినా చెడు ప్రవర్తనకు పాల్పడినా అదృష్టంగా భావిస్తారు. దానివల్ల అతడు తనకెదురేదీ లేదని అనుచరుల భక్తిని గౌరవాన్ని ఆసరాగా తీసుకొని అకృత్యాలకు పాల్పడుతాడు. అప్పుడతనిని అంతవరకు గౌరవించిన వారే అతని భండారం బయట పెట్టి అతను మోసగాడని ప్రచారం చేస్తారు. నల్లమందుభాయికి, అలాగే దొంగ సాధువుకు ప్రారంభంలో ప్రచారం చేసి, కొంతమందికి వారి వారి భక్తి విశ్వాసాల వల్ల కలిగిన ఆశ్చర్యకరమైన సంఘటనలను దొంగ సాధువు చేసినట్లు ప్రచారం చేసి అతనికా మహిమలను ఆపాదించి క్రొత్త వారిని ఆకట్టుకుంటారు. అలా అధికారం లేకుండా పాదాలకు మ్రొక్కించుకొనే దొంగసాధువు తన ఆటలో నష్టపోతాడు. నిజాయితీగా ఆయనకు ప్రణమిల్లినవారు లాభపడతారు. ఎందుకంటే మ్రొక్కిన వారి సంస్కారాల బరువును దొంగ సాధువు ప్రోగు చేసుకుంటాడు. వాటిని తగ్గించు కోవడానికతనికి





ఎన్నో జన్మలు అవసరమౌతాయి. అతనికి సద్గురువుతో సంబంధముంటే సద్గురువు అతని ఆట కట్టిస్తాడు. లేకపోతే ఆ దొంగ సాధువు సంక్రమించిన అందరి సంస్కారాల బరువుతో అనేక బాధలనుభవించి తద్వారా ఎన్నో జన్మల తర్వాత చివరికి లాభపడతాడు.

మూడవ రోజు బాబా అందరినీ మెహెరాబాదు కొండపైకి తన వెంట తీసుకొని వెళ్ళారు. తన భౌతిక దేహానికి అంతిమ నెలవైన సమాధిని వారికి చూపించారు. దానిలో రెండు సంవత్సరాలు (1927-28లో) ఏకాంతవాసం చేసానని, ఆ కొండపైన తన విశ్వ ఆధ్యాత్మిక కార్యం చేసానని, శరీర త్యాగం చేసిన తర్వాత 70 సంవత్సరాలకు, అది దివ్య క్షేత్రమౌతుందని, దైవ ప్రేమికులు, తత్త్వవేత్తలు, విద్యావంతులు భక్తి శ్రద్ధలతో ప్రణమిల్లుతారని బాబా చెప్పారు. నా సమక్షంలోనే ఇక్కడికి నా వెంట వచ్చిన మీరందరూ ఎంత అదృష్టవంతులో? అని వారి అదృష్టాన్ని కొనియాడారు బాబా.

అహ్మద్‌నగర్ నుండి వచ్చిన ప్రేమికులు వారి కుటుంబ సమస్యల గురించి బాబా ఎదుట ప్రస్తావించగా "బాధ్యతలను కలిగి ఉండండి కాని బందీలై పోకండి" అని అందరికి బాబా హెచ్చరిక చేసారు. ఈ క్రింది సందేశాన్ని యిచ్చారు. "పుస్తకాలు మరియు ప్రవచనాలు ఎప్పుడు కూడా ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని కలుగజేయవు. మనస్సు తనను తాను లేకుండా చేసుకోలేదు, ఒక వ్యక్తి తనపైన తాను దూకలేడుకదా! అలాగే, నన్ను ప్రేమించ వలసిన విధంగా ప్రేమించడం ద్వారానే

మనస్సు లేకుండా చేసుకొనవచ్చును. ప్రతి ఒక్కరికి నాపై ప్రేమ ఉంటుంది కాని నేను కోరిన విధంగా కాదు."

"సింహం అంటే ఇష్టపడి దానిని మెచ్చుకొనే వ్యక్తితో నా ప్రేమికులను పోల్చవచ్చును. సింహాన్ని ఇష్టపడే ఆ వ్యక్తి ఏకంగా ఒక సింహాన్ని తన యింట్లోనే తెచ్చి పెట్టుకొంటాడు. కాని భయంతో సింహాన్ని ఒక బోనులో బందించి ఉంచుతాడు. ఆ సింహానికి ఆహారం బయట దూరంగా ఉండి తినిపిస్తాడు. నా ప్రేమికులు కూడా నన్ను ఆ సింహం లాగానే చూస్తారు. వారికి నేనంటే ప్రేమే. నన్ను సుఖంగా సంతోషంగా ఉంచాలని ఆశిస్తారు, వారి ప్రేమతో నాకు ఆహారం అందిస్తూ ఉంటారు. కాని ఇదంతా బాబాను వారి నుండి వేరుగా దూరంగా ఉంచి చేసుంటారు. కాని వారు బోను తెరచి బాబా ఎడల తీవ్రమైన ప్రేమతో లోనికి వెళ్ళి ప్రేమయనే ఆ సింహానికి ఆహారం కావాలి. ప్రేమికుడు ప్రియతముని యెడల గల ప్రేమలో పూర్తిగా దహించబడడానికి సంసిద్ధంగా ఉండాలి". అని బాబా వివరించి చెప్పారు.

మధ్యాహ్నం 2 గంటల పది నిమిషాలకు బాబా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆ సందర్భంలో 1954వ సంవత్సరంలో మార్చి 1వ తేదీ రాత్రంతా రాజమండ్రిలో జరిగిన కార్యకర్తల సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. దానిలో నా పని అంటే ఏమిటో వివరించానని చెప్పారు. నా ప్రేమ సందేశాన్ని ప్రేమతో వ్యాప్తి చేసే వారికి నా జోహార్లు అని బాబా ముకుళిత హస్తాలతో చెప్పారు.

"అందరినీ ప్రేమించాలి, ఎవరిని నిందించకూడదు, ఇతరులను బాధ పెట్టరాదు, హృదయాన్ని నిర్మలంగా ఉంచుకోవాలి. బాబాను ప్రేమించవలసిన విధంగా ప్రేమించాలి. కార్యకర్తలకు స్వయంగా ఇలాంటి నడవడి లేకపోతే వారు ఇతరులనెలా ప్రభావితం చేయగలరు. అప్పుడది బాబా పనికాదు సరికదా బాబా బరువును అధికం చేస్తుంది. బాబా కార్యకర్తల రకాలను వారి విధేయత గురించి వివరించి చెప్పారు. కార్యకర్తలు వినమ్రంగా ఉండాలని, ఆధిక్యతకోసం పోరు, అహంకారానికి ప్రాధాన్యత నివ్వరాదని, వారివారి బృందాల నాయకుల పొరపాట్లను లక్ష్యపెట్టక, పనిలో వారికి తోడ్పడితే కార్యకర్తలుగా ఉండే అలాంటి వారే నిజమైన నాయకులు అవుతారని బాబా చెప్పారు.

ఈ సహవాస కార్యక్రమాల్లో సాకోరీ నుండి గోదావరిమాయి కన్యలతో వచ్చారు. బాబా దర్శనం చేసుకున్నారు. బాబా గోదావరి మాయి గురించి చెబుతూ కృష్ణునికి యశోదలాగా, గోదావరిమాయి నాకు యశోద (పెంచినతల్లి) అని చెప్పారు.

ఆఖరి రోజు (19.02.58 రోజు) బాబా అందరికి తన దర్శనం యిస్తూ ఎవ్వరూ వారి సమస్యలను బాధలను బాబాకు చెప్పడానికి ప్రయత్నించరాదని, తాను సర్వజ్ఞుడు కాకపోతే





వారు చెప్పుకున్నా దాని ప్రయోజన మేముంటుందని ప్రశ్నించారు.

ఈ మొదటి బృందపు సహవాస కార్యక్రమాల్లో లాహోర్ (పాకిస్తాన్) నుండి వచ్చిన రంజూ అబ్దుల్లాతో కలిసి వచ్చిన సాహెబ్ ఆస్మీ, బాబా దర్శనంచేసుకొని ఆలింగనం పొందాడు. బాబా ఆతని విశ్వాసాన్ని, ప్రేమను, అతడు ఉర్దూలో వ్రాసిన పుస్తకాలు, "సరోద్-ఎ-జాలిదాన్" మరియు "సాహెబ్-ఏ-జమా"లను శ్లాఘించారు. నన్ను చూడకుండానే ఆ మహమ్మదీయుడు, అది కూడా పాకిస్తాన్ దేశంలో మహమ్మదీయులకు మానవుడనై వచ్చిన నన్ను దేవునిగా, ప్రవక్తగా ప్రకటించి వ్రాయడం నాయందు ఆతనికి గల ప్రేమకు తార్కాణం అని బాబా చెప్పారు. అదే విధంగా "అబ్ క్యా బతావు మై, తేరే మిల్‌నే సే క్యా మిలా" అనే సాహెబ్ అస్మీ విరచితమైన ఘజల్ పాడగా విని, ఆ సమయంలో అక్కడ సాహెబ్ అస్మీ లేకున్నా ఆతనికి తాను ముక్తి ప్రసాదించినట్లు బాబా సంతోషంతో అనుగ్రహిస్తూ ప్రకటించారు. ఇది ఒక అరుదైన సంఘటన.

22.2.58వ తేది నుండి 26.2.58 వరకు తెలుగు, గుజరాతీ ప్రేమిక బృందాల సహవాసం జరిగింది. మొదటి రోజుననే బాబా తెలుగువారికి, గుజరాతీ భాష, గుజరాతీ వారికి తెలుగు భాష నేర్చుకోవడానికిది మంచి అవకాశమని చెప్పారు. మొదటి బృందంతో 15.2.58 నుండి 19.2.58 వరకు జరిగినట్లుగానే రెండవ బృందంతో 5 రోజుల సహవాసం జరిగింది. మొదటి రోజు బాబా అందరికీ దర్శనం, ఆలింగనం ప్రసాదించారు ప్రార్థనల్లో పాల్గొన్నారు. సందేశాలను వారి భాషల్లో చెప్పించారు. ఆ మాటలు మీకు అర్థం కాకపోతే మీరు నావైపే చూడండి. నేను మిమ్మల్ని చూస్తాను. అదే సహవాసం అని బాబా చెప్పారు. రెండవ గ్రూపువారిని కూడా బాబా కొండపైకి ఊరేగింపుతో తీసుకొని వెళ్ళి తన సమాధిని చూపించారు.

తెలుగు, గుజరాతీ వారి రెండవ గ్రూపు యొక్క సహవాస్‌లో జరిగిన మహత్తరమైన మరువరాని సంఘటనలు రెండు. మొదటిది 25.02.58 రోజున బాబా జన్మదినం జరుపుకొనే అవకాశం, రెండవది ఆఖరిరోజు ప్రత్యేక రైలులో వెళ్ళిపోతున్న వారికి బాబా కొండదిగువన రైల్వేలైను ప్రక్కన నిలబడి చేయి ఊపుతూ వీడ్కోలు చెప్పడం.

బాబా పుట్టినరోజు పండుగను చాలా ఘనంగా జరిపించారు. ఉదయం బాబా రాగానే హంసాకారంతో పూలతో అలంకరించిన కారులో బాబాను ఊరేగింపుతో తీసుకొని వచ్చారు. బాబా పాదాలను కడగడానికి ఆరంగావ్ గ్రామస్తులు గోదావరి- ప్రవరా నదుల సంగమస్థానమైన టోకా నుండి కావళ్ళలో నీరు తీసుకొని వచ్చారు. కావళ్ళను ఎక్కడా భూమిపైన పెట్టకుండా వారు విశ్రమించినప్పుడు చెట్ల పైన కట్టి ఉంచి తెచ్చారు. బాబా తన పాదాలు కడగడానికి తెలుగు, గుజరాతీ వారి నుండి 12 మందికి అవకాశం యిచ్చి అందరూ ఏకాభిప్రాయంతో 12 మందిని ఎంచుకోవాలన్నారు. అలా ఎన్నుకున్న

వారు కడిగితే తన పాదాలను అందరు కడిగినట్లేనని చెప్పారు. కాని ఆ 12 మందిని ఎంచుకోవడంలో రెండు బృందాల వారు కూడా ఏకాభిప్రాయానికి రాలేక విభేదాలతో రాత్రంతా తర్జన భర్జనలు చేసి విఫలమయ్యారు. అందువల్ల బాబా తన పాదాలను తానే కడుగుకున్నారు. అందరిలో తానే ఉన్నందున అందరూ తన పాదాలు కడిగినట్లేనని ఊరడించారు. బాబా పాదాలు కడిగిన తుండుగుడ్డను మొసలికంటి తిరుమల రావు గారికి యిచ్చారు. ఆయన వింధ్యా గవర్నరుగా నియమింపబడి బాబా వ్రాయించి యిచ్చిన “గాడ్‌స్పీక్స్” గ్రంథాన్ని తెలుగులోనికి అనువదించిన “భగవద్వచనములు” అనే గ్రంథాన్ని బాబాకు ఆ సందర్భంగా చూపించి ముద్రించడానికి అనుమతి పొందారు.

1958లో మెహెరాబాద్‌లో ఇచ్చిన బ్యాడ్జీల నమూనా

ఈ సహవాసం కోసం ప్రీతమ్‌సింగ్ కుమారుడు సో॥ వైరామ్ సింగ్ 1958లో తయారు చేసి యివ్వబడిన సిల్కు గుడ్డ బ్యాడ్జీలను పోలిన బ్యాడ్జీలను తనంట తాను సిద్ధంచేసి తీసుకొని వచ్చి అందరికీ ఉచితంగా పంచారు. తనకు తన తండ్రికి 1958లో యివ్వబడిన బ్యాడ్జీలను తెచ్చి రెండు చేతులకు కట్టుకున్నాడు. ఈ సందర్భంగా బాబా కృప (బాబాస్ గ్రేస్) అనే సహవాస స్మృతులను వివరించే పుస్తకాన్ని ముద్రించి ఉచితంగా పంచారు. అలాగే ట్రస్టు వైపున ఒక సావనీర్ కూడా ప్రచురించి అందరికీ ఉచితంగా యిచ్చారు. వైరామ్‌సింగ్ మాట్లాడడానికి వేదిక మీదకు వచ్చి తన్మయుడై గద్గద స్వరంతో జైబాబా చెప్పి వ్యక్తం చేయలేని తన సంతోషంతో వెళ్ళిపోయాడు.

నాడు 1958లో 26.02.58 రోజున ప్రత్యకరైలులో వెళ్ళే ప్రేమికులకు బాబా చేయి ఊపుతూ వీడ్కోలు చెప్పుతూ నన్ను మీతో తీసుకొని వెళ్ళండని చెప్పే దృశ్యాన్ని నేడు 17.02.2008 రోజు తెరపై చూపించగా చూస్తూ అందరు ప్రేమికులు బరువైన హృదయాలతో, నాటి, నేటి సహవాసం అనుభవాలను పదిలంగా భద్రపరచుకున్నారు.





## 2008 ఫిబ్రవరి 15,16,17 తేదీలలో మెహెరాబాద్ సహవాస్ పాల్గొన్న పలువురు అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

**బుర్రకథ**

1958 ఫిబ్రవరిలో బాబా ఎదుట బుర్రకథ చెప్పిన దళం శ్రీ బాల గోపాల భాస్కరాజు (90), శ్రీ వెంకటాచారి (86), సత్యం (84), తిరిగి ఫిబ్రవరి 2008లో తమ ముఖాలకు రంగుపూసుకుని, అవతారుని ఎదుట చెప్పిన రీతిలోనే అంతే ఉత్సాహంగా నాటి బురక్రథను ముప్పై నిముషాలకు పైగా చెప్పారు. ఆహుతులు మైమరిచారు.

**సహవాస్ ఆద్యంతం అన్యభాషల్లో**

స్వర్ణోత్సవ సహవాస్ ఆద్యంతం అధికంగా హిందీ- మరాఠీయులు తమ భాషల్లో ప్రసంగం చేశారు. దాంతే మాకేం పాలు పోలేదని బాబా ప్రేమికులు చాలా మంది తమ బాధ వ్యక్తం చేశారు. తెలుగు అనువాదం వుంటే బాగుండేది. శ్రీమతి డాలీ దస్తూర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని ఇక్కడ బాబా ప్రేమ ముఖ్యం. భాష అప్రధానం అన్నారు. లేదంటే మీరు (తెలుగువారు) మాట్లాడండి. మేం వింటాం అన్నారు ప్రతి వారి మాటల్ని అనువాదం చేసేటంత సమయం లేదని నిక్కచ్చిగా చెప్పారామె.

మా హృదయాలు నొచ్చుకున్నాయి. ***-సి. హెచ్. అఘోరపతి, విజయనగరం***

**మహిళలు**

మెహెర్‌బాబా 1958 సహవాస్ ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేశారు. అయితే, వారికి తోడుగా వుండేందుకు గాను పురుషుల్ని కూడా అనుమతించారు. కానీ చంటిపిల్లలు, 17 సం॥ లోపు వారు అనుమతించరని ముందుగానే ప్రకటించారు.

అయినా కూడా మగవాళ్ళు, చాలామంది స్త్రీలను తమ ఇళ్ళకే పరిమితం చేసారన్నట్లు మహిళలు తక్కువ సంఖ్యలో హాజరయినట్లు బాబా మండలి ప్రకటించింది. ఆ తర్వాత బాబా కూడా సహవాస్‌లో ఈ విషయమై ప్రస్తావించారు. ఆ ఫలితమే నేడు ఏ రంగంలో చూసినా మహిళా సాధికారత అధికంగా వుంటోందని చెప్పొచ్చు.

***-ఎన్.వి.వి సత్యన్నారాయణ, హైదరాబాద్.***

# స్పెషల్ రైలు

ఫిబ్రవరి 1958 మూడోరోజుల సహవాస్ ముగిశాక, మా తిరుగు ప్రయాణం కోసం బాబా - మండలివారే ఆనాడు మా కోసం ఒక ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారు. ఇకపోతే, అహ్మద్‌నగర్ నుంచి వస్తున్న ఆ రైలు మెహెరాబాద్‌లో ఆగగానే, ఏ ప్రాంతీయులు -

ఎవరు – ఎక్కడ ఎక్కాలో అక్కడ వారి సామాన్లతో వుండమన్నారు. రైలు ఇంజను నుంచి చివరి భోగీ దాకా ప్రతి భోగీమీద ఆయా ప్రాంతాల వారి పూరి పేర్లు రాయించారు. మేం కాకినాడ వాళ్ళం. మేం ఎక్కడ నిల్చున్నామో అక్కడకి వచ్చి మా కాకినాడ భోగీ ఆగింది. ఈనాడు మనం చూస్తున్న భోగీ నంబర్లు – బాబా ఆనాడే మాకు చూపారు. అంతేకాదు రైలు ఇంజను దగ్గర బాబా నిల్చుని, ప్రతి భోగీ ఆయన ముందు నుంచి వెళ్తుంటే– ప్రేమావతారుడు మా అందరికీ వీడ్కోలు చెప్పారు. అవతారునిది అంతా చక్కని ప్రణాళిక ప్రకారం ఎంత చిన్న పనినైన నిర్వహించేవారు.

• • •

ప్రత్యేక రైలు ఏర్పాటులో బాబా మండలి వారికి పదిహేను వేల రూపాయలు లోటు వచ్చిందని ప్రకటించారు. బడ్జెట్‌లోటుతో పస్లేకుండా ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని బాబా ఆదేశించారు. తెలుగు బాబా ప్రేమికులు శ్రీ జూపూడి సుబ్బన్న తాను ఆ 15 వేలు లోటు భరిస్తానని బాబా ఎదుట అన్నారు.

బాబా ఈ ప్రతిపాదనని సున్నితంగా త్రోసిపుచ్చుతూ. మీ వూరు వెళ్ళాక – ఆ డబ్బులలో నా నామవ్యాప్తి కోసం కొన్ని కరపత్రాలు పంచి పెట్టమన్నారు. ఐతే, జూపూడి గారు తాను పై రెండు కార్యక్రమాలూ చేపడతానన్నారు. ఆ అవకాశం ఇప్పించమని బాబాని అడిగారు.

అందుకు బాబా సరేనన్నారు.

**ఎవరికి ఏ అవకాశం ఎప్పుడు దొరుకుతుందో??**

***– ఎన్.వి.వి సత్యనారాయణ, హైదరాబాద్.***

# జన్మకిదే సద్భాట

ఆనాడు హాజరయిన తెలుగు వారిలో ఒకరిని బాబా ఎదుట ఒక పాట పాడే అవకాశం ఇచ్చారు. ఆసమయంలో కాకినాడకు చెందిన బాబ్జీ– **"జన్మకిదే సద్భాట"** అని ఆలపించారు.

అలాగే, ఇటీవల స్వర్ణోత్సవ వేడుకలలో ఫిబ్రవరి 16న రెండోరోజున తెలుగు వారు ఎవర్నైనా స్టేజిపై వచ్చి ఒక పాట పాడమన్నారు. ఆ అనౌన్స్‌మెంట్ చేసిన సమయంలో – వేదిక సమీపంలో తెలుగు వారందరూ భోజన విరామంలో బిజీగా వున్నారు. అక్కడ నేనొక్కడినే వున్నాను. ఇంతలో బి.రామక్రిష్ణయ్య అటుగా వచ్చారు. **జన్మకిదే సద్భాటంటూ** ఆయన ఆనాటి పాట అందుకున్నారు. ఆ పాటను తిరిగి పాఠకులకోసం ఈ సంచికలో ప్రచురించాం. గమనించగలరు. ***– బాలక్రిష్ణారావ్, సికింద్రాబాద్***





## నేటికీ అదే సంప్రదాయం

1958 సహవాస్‌లో బాబా పాదాలు కడగటానికై ప్రత్యేకంగా టోకా ప్రాంతంలోగల గోదవరి నది నుంచి ఆరంగావ్ గ్రామంలోని స్థానిక బాబా ప్రేమికులు తీసుకువచ్చారు. ఆరంగాం వాసులు ప్రతిఏడాది బాబా జన్మదినోత్సవానికై టోకా గ్రామంలోని గోదావరి నుండి ఆ పవిత్ర జలాలు బాబా పాదాలు కడగటానికై తీసుకురావం ఒక ఆనవాయితీ. ఆ జలాలతో బాబా పాదాలు కడగటానికి ముందుగా ఆనాటి సహవాస్‌కు విచ్చేసిన తెలుగు, గుజరాతీ వాళ్ళలోనించి ఎవరైన వాళ్ళలో వారే 12 మందిని స్వయంగా ఎంపిక చేసుకుని తన పాదాలు కడగే అవకాశం ఇచ్చారు. తన ప్రేమికులందరి తరపున ఆ పన్నెండు మంది నిలుస్తారని బాబా అన్నారు. ఎవరా 12 మంది? అంటే ఒక నిర్ణయానికి ఎంత సేపటికీ రాలేకపోయారు. ఎవరికి వారే తమకు ఈ చాన్సు కావాలనుకున్నారు. ఈ తంతు ఎంతసేపటికీ తేలకపోయేసరికి చివరాఖరుకు వద్దులే, నాపాదాలు నేనే కడుక్కుంటానని బాబా అన్నారు. అందరిలోనూ నేనున్నాను కాబట్టి ఫరవాలేదని తన ప్రేమికులను ఊరడించారు. చేజిక్కిన సువర్ణావకాశం చేజారిపోయినట్లే కదా. ***– ఎన్.వి.వి సత్యనారాయణ, హైదరాబాద్.***

## కళ్ళెదుట ద్యోతకమయింది

బాబా సహవాస్‌లో పాల్గొనలేకపోయామనే ఓ తెలియని బాధ నాలో చాలా కాలంగా వుంది. మేం బాబా పరిధిలోకి 1968 ప్రాంతంలో వచ్చాం. ఫిబ్రవరి 15 నుంచి 17 దాకా నిర్వహించిన స్వర్ణోత్సవ సహవాస్‌కి హాజరయ్యాను. బాబా మా కళ్ళెదుట వున్నట్లే, ఆయనతో స్వయంగా పాల్గొన్నట్లు అనుభూతి నాకు కల్గింది. ధన్యులమయ్యాం. ఈ సహవాస్ గురించి 'లార్డ్ మెహెర్' పుస్తకంలో చదువుతుంటే బాబాతో వున్నట్లే వుండేది. కానీ, ఈ దఫా, మెహెరాబాద్‌లో పాల్గొనటంతో మాకు ఒక విశేష అనుభూతి లభించింది. మెహెరాబాద్‌లో 1958 సహవాస్‌లో పాల్గొన్నట్లే నా కన్పించింది.

***– యం బాలక్రిష్ణారావ్, సికింద్రాబాద్.***

## తెట్టెకుంట (అగ్రహారం)

కరీంనగర్ జిల్లాలోని తెట్టెకుంట (అగ్రహారం)లో అవతారుని 114వ జన్మదినోత్సవ వేడుకలు ఫిబ్రవరి 24, 25 తేదీలలో ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు దుగ్యాల ప్రభాకర్ రావు, స్థానిక మెహెర్‌బాబా ట్రస్ట్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో శ్రీ నార్లవిఠల్, సిరిగిరి రమేశ్, ఏ. మొగిలయ్యలతో పాటు శ్రీమతి సునంద, ఆర్.డి.ఒ, సిరిసిల్ల శ్రీ రమేశ్, సహాయ కమీషనర్, దేవదాయ శాఖ, శ్రీ మహేశ్వర్, తహశీల్దార్, వేములవాడ, స్థానిక పోలీస్ అధికారులు శ్రీ సంజీవ్ కుమార్, పి. వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారని శ్రీ ప్రభాకర్ తెలిపారు.

# 1958 సహవాస మండపములో ప్రదర్శించబడిన
# బాబా సూక్తులు

1. ఇతరులెవ్వరిపైనా కోపగించకుండా మీ తప్పులపైననే క్రోధాన్ని ప్రదర్శించండి. ఇతరులెవ్వరినీ అసహ్యించుకోకుండా మీ కామ వాసనలనే అసహ్యించుకొనండి. సహనశీలత మరియు న్యాయబుద్ధి యొక్క అత్యధిక సంపదను సంప్రాప్తింపజేసే ప్రలోభాన్ని మాత్రమే కలిగి ఉండడి.నా అనుగ్రహాన్ని పొందదానికి మీ ప్రేమతో నన్ను వశపరచుకోవడమే మీ అభిమతం కావాలి. మీ కోరికలపై దాడి చేయండి. భగవదైక్యమనే విజయం మిమ్మల్ని వరిస్తుంది.

2. నిజమైన సంతోషము ఇతరులను సుఖపెట్టుటలోనే యిమిడి ఉంటుంది. ఇతరులను పరిపూర్ణులుగా చేయుటకై ఉద్దేశింపబడినదే నిజమైన ఆకాంక్ష. అది ముందుగా మిమ్మల్ని పరిపూర్ణులుగా చేయుటకు దోహదపడుతుంది. సత్యమైన లక్ష్యం ఏమిటంటే మొదట మీరు దైవత్వాన్ని పొంది తద్వారా ఇతరుల దైవత్వాన్ని ఆకాంక్షిస్తూ సహకరించడమే.

3. భగవంతుని కోసం మరణించడమే నిజమైన జీవితము. మీరు మీ కోసం తక్కువగాను ఇతరుల కోసం అధికంగా జీవించండి. మానవుడు స్వయంగా తనకు తాను మరణించాలి తద్వారా మిగిలిన జీ వాత్మలన్నింటిలో జీవించి ఉండే సామర్థ్యాన్ని పొందగలగాలి. భగవంతుని కోసం మరణించేవాడు శాశ్వతుడై ఉంటాడు.

4. నిన్ను నీ సర్వస్వాన్ని ఎలా ప్రేమిస్తావో అలా ఇతరులను ప్రేమించాలి. ఎవరి ప్రేమ ఆపదలతో పరీక్షించబడుతుందో వారు అదృష్టవంతులు. ప్రేమికులు ప్రియతముని కోసం వారి సర్వస్వాన్ని త్యాగం చేయాలని ప్రేమ కోరుతుంది.

5. ఏ వస్తువు మీదనైనా అధికారం కావాలనే కోరిక లేకుండా సర్వస్వము సమర్పించుకొనే అభీష్టాన్ని పెంపొందించుకోవాలి. ఇతరులకు సేవజేయడంలో నీవు నాకే సేవజేస్తున్నావనే భావనతో సేవ జేయాలి. నా యిచ్ఛకు పూర్తిగా బద్ధులై పోవాలి, అప్పుడు నా యిచ్ఛయే మీ యిచ్ఛగా మారిపోతుంది. మీకు నాలో ఉన్న శ్రద్ధను, విశ్వాసాన్ని దేనితోను ఏ విషయంతోను ముడి పెట్టుకోవద్దు, అప్పుడు మీ బంధనాలన్నీ తొలగిపోతాయి.

6. కోరికలు లేని స్థితిని తప్ప మరే యితర విషయాలను కోరుకోకండి. అన్ని ఆశలను అధిగమించడమనే ఆశను తప్ప మరే యితర విషయాలనాశించకండి. మీకు సర్వస్వం ప్రాప్తిస్తుంది.

7. సహవాసకాలపు ఈ సమయం నా బాధలు నా అసహాయతల సమయం. నా అవమానం తర్వాత నా గుణగణాల స్తవం చేయబడుతుంది.





### బాబా సమక్షంలో పాడిన
# జన్మకిదే సద్భాట

*-రచన, గాత్రం* - ఎమ్.ఎస్.బాజ్జీ

**జన్మకిదే సద్భాట -కైవల్యమొందే బాట**

**మోక్షార్థంబౌ మానవజన్మ - చేయకుమా వృథా ॥2॥**

1. పరబ్రహ్మ పరమాత్మ మెహెర్‌బాబా రూపము దాల్చి
ఈ సృష్టి వినాశవసాన కాలమున ప్రేమబీజములు నాటే
జేజేలు, జేజేలు- జగదీశ్వరునకు జేజేలు
అంజలి మోడ్చి అర్పించుమురా పావనమౌ నీజన్మ
చేయకుమా వృథా ॥2॥ ॥జన్మకిదే॥

2. స్వమతములను విడనాడే- అభిమత మేమియు లేదు
ఆయా మతముల నిజధర్మములను ఆచరించుచుండు
జేజేలు, జేజేలు- జగదీశ్వరునకు జేజేలు
అంజలి మోడ్చి అర్పించుమురా పావనమౌ నీజన్మ
చేయకుమా వృథా ॥2॥ ॥జన్మకిదే॥

3. స్వార్థ రహితమౌ సేవ దైనందిన స్వకీయ ధర్మం
నిష్కామ సేవ మనసార ప్రేమతో ఆచరించుచుండు
జేజేలు, జేజేలు- జగదీశ్వరునకు జేజేలు
అంజలి మోడ్చి అర్పించుమురా పావనమౌ నీజన్మ
చేయకుమా వృథా ॥2॥ ॥జన్మకిదే॥

4. బాబా బాబా యనుచు పదునాల్గు సార్లు ప్రతి దినము
నిర్మల చిత్తుడవై ప్రభు నామము సంస్మరించుచుండు
జేజేలు, జేజేలు- జగదీశ్వరునకు జేజేలు
అంజలి మోడ్చి అర్పించుమురా పావనమౌ నీజన్మ
చేయకుమా వృథా ॥2॥ ॥జన్మకిదే॥

5. శ్రీ మెహెర్‌బాబా పిలుపు లోకాలకెల్ల మేల్కొలుపు
సమయము మించే తరునమిదే విడనాడ కోయి అవకాశం
జేజేలు, జేజేలు- జగదీశ్వరునకు జేజేలు
అంజలి మోడ్చి అర్పించుమురా పావనమౌ నీజన్మ
చేయకుమా వృథా ॥2॥ ॥జన్మకిదే॥

# అవతార్ మెహెర్‌బాబా జీవిత చరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ,
లార్డ్ మెహెర్
వాల్యూం-3 (1925-29)

**మెహెర్‌ప్రభు - వాల్యూం-3**

***- తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

మతం అంటే ఏమిటి? అసలు మనకెవ్వరికైనా మతం అంటే ఏమిటో తెలుసా! ఒకమతం వదలిపెట్టి మరో మతంలోకి వెడితే, అంటే మతమార్పిడి వల్ల ప్రయోజనం వుందా!

ఇవన్నీ చిక్కు ప్రశ్నలు. వీటికి జవాబు వో పట్టాన దొరకదు.

కానీ, ఆ వేళ బాబా తనదైన శైలిలో మతం ముడివిప్పారు.

బాబా బోధనా సారాన్ని ప్రముఖ తెలుగుకవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు పాటరూపంలో చెప్పారు.

**మతమన్నది నా కంటికి మసగైతే,**
**మతం వద్దు, గితంవద్దు,**
**మాయామర్మం వద్దు, అన్నారు.**

ఇంతకీ బాబా ఏమి చెప్పారని కదూ మీ ప్రశ్న! అయితే వినండి, ఆయనేమన్నారో! మతం ఓ పంజరం-బోను-వంటిదన్నారు. మనమందరం బోనులో చిక్కుకున్న పక్షులమన్నారు. మతం మారితే ఫలితం శూన్యం, ఎందుకంటే మీరు వొక బోనులో నుంచి మరో బోనుకి వెడుతున్నారు. తప్ప మరేం చేయటంలేదని పేర్కొన్నారు. మీ బోను తలుపులకి లోపల నుంచి తాళం వేశారు జాగ్రత్త, సుమా! అని హెచ్చరించారు. పక్షి రెక్కలు విప్పుకు ఎగరాలి. అలా చేయాలంటే బోనులో నుంచి బయట పడాలి. కానీ పక్షి రెక్కల్ని బోనుకి త్రాడు వేసి కట్టేశారు. పక్షికి స్వేచ్ఛ కావాలంటే ఆ త్రాడు త్రెంచుకోవాలి అని చెప్పారు.

మరి ఈ బంధనం తెగేది ఎప్పుడు! సద్గురువు కృప లభిస్తే బోను త్రాడు తెంపుతాడు. పక్షికి స్వేచ్ఛా జీవనం ప్రసాదిస్తాడని బాబా శెలవిచ్చారు.

ఇక్కడ పక్షి అంటే ఆత్మ అని వేరే చెప్పనక్కర్లేదు కదా.

బాబా మరోమాట చెప్పారు. ఎవరికి వారుగా, బంధనా విముక్తి కోసం ప్రయత్నించాలి. అది ఎలాగ! ఏకాగ్రతతో! అడవిలో వేటకి వెళ్లిన వాడు, వేటకుక్కల్ని





ఎలా పరుగెత్తిస్తాడో అలా! వాటిని అటూ, ఇటూ వెళ్ళనిస్తాడా! లేదుకదా! అంతటి శ్రద్ధా శక్తులతో మనస్సు పెట్టి ప్రయత్నించాలి. ఎవరికివారే, భగన్మార్గంలో పడ్డాక ఏకాగ్రతకోసం ఎన్నో పద్దతులు అవలంబించాలని బాబా చెప్పారు. సర్వం మరచిపోయి భవ బంధాలకి అతీతంగా భగవన్నామస్మరణలో జీవితం గడపడం ఓ ఎత్తు అయితే, మనిషి తనకి ఏది ప్రధానం అనుకొంటాడో వాటి పట్ల దృష్టి పెట్టకపోవడం మరో ఎత్తు. మనిషి ప్రధానం అనుకునేవి- తిండి, బట్ట, మంచినీళ్ళు. ఇవి లేకపోతే బ్రతకలేననుకొంటాడు. కాబట్టి వీటి పట్ల నిరాసక్తత చూపించవచ్చు. నిరాసక్తత అనేకంటే, అసలు వీటి గురించి పట్టించు కోకుండా వుంటే మంచిది అన్నారు. ఇలా గమ్యం చేరేందుకు ఎన్నో మార్గాలున్నా. ప్రేమ ద్వారా ముందుకు పోవడానికి బంధనాలు త్రెంచుకోవడానికి ప్రయత్నించమని బాబా హితువు చెప్పారు. “భగవంతుడిని ప్రేమించండి” అన్నారు. సద్గురువు వస్తూనే బంధనాలు త్రెంపి, పక్షికి స్వేచ్ఛని ప్రసాదిస్తాడు అని చెప్పారు.

క్రిస్తును నేనే. ఈ ప్రపంచం వునికి నావల్లనే. నేను కాలమాన పరిస్థితులకి అతీతుడని. నేనే సర్వస్వాన్ని. నాలో ఏకత్వం తప్ప, భిన్నత్వం లేదు అని స్పష్టం చేశారు.

ఇంతకీ ఆనాటి బాబా ఉవాచ సారాంశం తెలిసి వచ్చిందికదా పాఠకమహాశయా! హిందూ మతాన్ని దుయ్యపడ్తుంటారు మన దేశంలో.

ఇలా పరస్పర నిందారోపణలు మత పెద్దలకి కూడదు. అన్ని మతాలు ఒక్కటే. మతం కేవలం భగవంతుని చేరటానికి ఆలంబనగా మారాలి తప్ప, అడ్డంకి కాకూడదని బాబా 1920 దశకంలోనే చెప్పారు.

ఫిబ్రవరి 26వ తేదీ బాబా నగర్ కి వెళ్ళారు. నేషనల్ స్కూలుకి రమ్మని ఆ స్కూలు పెద్ద బోర్కర్ ఆహ్వానించాడు. చాలా మంది మండలి వారు బాబా వెంట నగర్ చేరుకొన్నారు. స్కూలు దగ్గర, వీరందర్ని బోర్కర్ సాదరంగా ఆహ్వానించాడు. స్కూలు పిల్లలతో పాటు చాలామంది నగర పెద్దలు బాబాని దర్శించుకొని తరించారు. బోర్కర్ బాబాని పూల మాలలతో ముంచెత్తాడు. బాబా దైవత్వాన్ని వివరించాడు. బహుశా ఆనందం పట్టలేక కామోసు, అప్పటి వరకూ గోప్యంగా వుంచిన మెహెరాశ్రమం సంగతి బయట పెట్టేశాడు.

“మెహెరాబాద్ వో గొప్ప పుణ్య క్షేత్రం. త్వరలో అక్కడ బాబా స్కూలు పెడుతున్నారు. పిల్లలకి చదువుతోపాటు, తిండి, బట్ట ఉచితం. మెహెరాశ్రమమని ఆ స్కూలుకి పేరు పెడుతున్నారు. అక్కడ పిల్లలకి మంచి చదువు చెప్తారు. ఇందులో నా కెటువంటి అనుమానం లేదు. మెహెరాశ్రమ పిల్లలకి మరో మేలు జరుగుతుంది. అది మీరెవరూ వూహించలేరు. శ్రీ సద్గురు మెహెర్‌బాబా దివ్య సాన్నిధ్యంలో పిల్లలు వుంటారు. అది ఎంత అదృష్టమో కదూ,” అని అన్నాడు.

మూడు నాలుగు రోజుల తర్వాత అంటే, మార్చి ఒకటవ తేదీన, మెహెరాబాద్‌లో ప్రాదమికపాఠశాల ప్రారంభమయింది. మెస్ క్వార్టర్లలో క్లాసులు పెట్టారు. ఆరంగావ్ పిల్లలు, అప్పటికే మెహెరాబాద్‌లో వున్న పిల్లల స్కూలులో చేరారు. స్కూలు ప్రిన్స్‌పాల్ ధాకే. వైస్ ప్రిన్సిపాల్- చాన్జీ. మెహెందర్జి, నిశాల్, విష్ణు, టీచర్లు. గైక్వాడ్ అనే మరొకరిని కూడా బాబా పాఠాలు చెప్పమన్నారు. వారం తిరగకుండానే, నిశాల్‌ని నేషనల్ స్కూలుకి బదిలీ చేశారు. అతని స్థానంలో టీచరుగా ఛగన్‌ని నియమించారు.

మండలి వారు కావడంతో, చాన్జీ, విష్ణు, ఛగన్‌లకి జీతభత్యాలులేవు. మిగతా టీచర్లు బయటి వాళ్ళు కావడంతో వాళ్ళకి నెలసరి వేతనం ఏర్పాటు చేశారు.

మార్చి 7వ తేదీన పూనే నుంచి ఛాన్జీ సోదరుడు నౌరోజీ హెచ్. దాదా ఛాన్జీ, ఆయన కుటుంబంతో వచ్చాడు. బొంబాయి వాళ్ళయినా, కంట్రాక్టరుగా పూనేలో వుంటున్నాడు. పార్శీల స్కూలు కోసం మొగపిల్లల హాస్టలు బిల్డింగ్ కడ్తున్నాడు. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు- అర్నావజ్, నర్గిస్, దోడా. ఈ మధ్యనే కొడుకుపుట్టాడు. పేరు తెహెమతేన్. భార్య బచామయి. నాలుగు నెలల బాలింతరాలు.

వీళ్ళతోపాటు వో కుర్రాడు వచ్చాడు. అతని పేరు మెహెర్జీ అర్దషీర్ కర్కారివ. వీళ్ళకి దగ్గరబంధువు పూనేలో వీళ్ళున్న చోటనే వుంటాడు. "మాతో పాటు రావయ్యా" అంటే ముందు ఇష్టపడలేదు."సరదాగా రా. వో పిక్నిక్‌కి వెళ్ళాననుకో," అంటే కాదనలేక వచ్చాడు.

దాదా ఛాన్జీతో పాటు కర్కారియా కూడా బాబా దర్శనం చేసుకొన్నాడు. ఏం చేస్తున్నావ్, అని అడిగారు. చదువు కొంటున్నాను అన్నాడు. సైన్సు, ఇంజనీరింగ్ చదువుతున్నానన్నాడు. ఆ తర్వాత ఏం చేస్తావని బాబా మళ్ళీ ప్రశ్నించారు. ఏ ముంది సైన్సు డిగ్రీ తీసుకొంటానన్నాడు. "మా స్కూలులో పని చేయకూడదూ? టీచరుగా వేసుకొంటాం" అన్నారు.

ఈ సలహా పెద్దగా నచ్చలేదు. కర్కారియాకి. అతని ముఖం చూస్తేనే ఈ సంగతి తెలిసిపోతుంది. అందుకనే కామోసు బాబా వో మాట అన్నారు.

ఆ కుర్రాడు పెదవి కదపలేదు.

దాదా ఛాన్జీ కుటుంబానికి మాత్రం బాబా దర్శనంతో పునీతులమయ్యామన్న భావన కలిగింది. "ఏమి దివ్య తేజస్సు" అని తన్మయులయ్యారు. బాబా దివ్య నేత్రాలు తమ హృదయాంతరాలలోకి చూస్తున్నాయన్న భావనతో వొళ్ళంతా పులకించింది. దాదా ఛాన్జీ జొరాస్ట్రియన్లయినా, బాబాకి పాదాభివందనం చేశారు. వాళ్ళతో వచ్చిన కర్కారియా మాత్రం అలా చేయలేదు సరికదా, కొంచెం దూరంగా నిలబడి, రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఇతని తండ్రి నవసారి (గుజరాత్)లో పార్శీ పురోహితుడు మరి.

(సశేషం)





# స్పెషల్ బహుమతి
# ఆఖరుతేదీని పొడిగించడమైనది

మెహెర్‌బాబా పత్రిక సర్క్యులేషన్ కనీసం పదివేలు వుండాలన్నది మా ఆకాంక్ష. అంటే, పాఠకుల సంఖ్య కనీసం ఒక లక్ష అవుతారన్నది ఆశయం.

కోటి మందికి పైగా మెహెర్ ప్రేమికులున్న తెలుగునాట, పత్రిక సర్క్యులేషన్ కనీసం పది వేలయినా వుండాలన్నది మా ఆశయం.

## సహకారం

బాబా ప్రేమికులుగా 'మెహెర్‌బాబా పత్రికను' మనలో మనమే చుదువుకుని తృప్తి చెందడం సరికాదు. మన బంధుమిత్రులందరికీ, అవతార్ మెహెర్‌బాబా గురించి తెలుసుకోవాలనుకునే వారందరికీ పత్రికను అందజేయడంలో మీ అందరి సహకారం కోర్తున్నాము.బాబా ప్రేమికులుగా ప్రతి ఒక్కరూ- తమ వంతుగా ఒక్కొక్కరూ నలుగురో/ ఐదుగురినో కనీసం సభ్యులుగా చేర్పించండి. వారందరికీ మెహెర్‌బాబా పత్రిక అందేలా మాతో సహకరించమని కోర్తున్నాము. ఇది అవతారుని సేవగా భావించమని అర్థిస్తున్నాము.పత్రిక ప్రతి నెలా 19/20 తేదీలలో పోస్టు చేస్తున్నాము. ప్రతినెలా 25లోగా అవతారుడు మీ ఇంటి తలుపుతడతాడు.

సాదరంగా ఆహ్వానించండి!!

## బహుమతి

**మెహెర్‌బాబా పత్రికకు అత్యధిక సంఖ్యలో చేర్పించిన ౕశీజా ౕషశీ ×అౕఅజఅౕబుశ్రీం కు గత ఏడేళ్ళుగా ప్రచురిస్తున్న మెహెర్‌బాబా మాసపత్రికలను నాలుగు వాల్యూంలలో వున్న బౌండ్ సంపుటాలను ప్రత్యేక బహుమతిగా అందజేయగలం. ఇది అమూల్య సంపద.**

**పాఠకుల విజ్ఞప్తి మేరకు ఈ "స్పెషల్ బహుమతి" ఆఖరు తేదీని 2008 జూన్ 30 వరకూ పొడిగంచడమైనది.**

**బహుమతిని 2008 జూలై ఒకటో తేదీన ప్రకటించి, అవతారుని మౌన దినం జూలై 10 నాడు మెహెరాబాద్‌లో బహుమతి అందించాలని నిర్ణయించడమైనది. బాబా ప్రేమికులు, సెంటర్లు- అందరూ ఉత్సహంగా పాల్గొని, ప్రోత్సహించాలని మనవి.**

# బాటసారులు

అదృష్టవశమున వారి కష్టములు గట్టెక్కినట్లు ఆ సాయంకాలము ఒక యెద్దుబండి కుదుర్చుకొని అందులో తిరుచినాపల్లి చేరుకొనిరి. రాత్రింబగళ్ళు కష్టముల కోర్చి వారితోకూడా అంతవరకు ఉండి సహాయపడిన సర్దార్‌సాహెబ్‌ను అక్కడ వదలి వ్యర్థంగా ఒక్కమారు రామేశ్వరం వెళ్ళివచ్చి, వట్టి చేతులతోను. రిక్తహృదయతోను బెంగుళూరు మరలివచ్చిరి.

వరదలవలన కలిగిన వినాశనమును తలచుకొనినచో ఒక్క మస్తును వారితో తీసుకొని వచ్చుటకు కూడా ఏరుచ్ కాకాలకు అమానుషమైన సామర్థ్యము కావలసివచ్చెడది. నాగపట్నము నుండి వచ్చునప్పుడు వారు పడినపాట్లకు-పైగా సూర్యాస్తమయానంతరం ఒక్కపూటే కడుపునిండ భోజనము చేయవలెనను నిర్బంధనకు లోనగుచు మస్తులెవ్వరూ తమతో లేకుండుటే అప్పటికి వారికి మహోపకారమయ్యెను. వారికున్న బరువుతోపాటు మస్తుకూడా ఉన్నచో చెప్పలేని ఆతని లోపాలన్నియు సహించుట మిక్కిలి దుర్భరమై యుండెడిది. మంచి సమయములందే వారితో పడుట కష్టసాధ్యము. అందులో ఇక ఇటువంటి ప్రయాణములో మస్తులుంటే పడేపాట్లు చెప్పవలయునా?

కాకా ఈరుచ్ వారి ప్రయత్నమునందు విజయము సాధించలేకపోయిరి. గావున కొంతమంది శిష్యులతో ఆ మస్తులను కలిసికొని వీలయితే ఒక్కరినిగాని ఎక్కువమందినిగాని బెంగుళూరు ఆశ్రమమునకు తీసికొని వచ్చుటకు బాబా స్వయముగా బయలుదేరిరి.

బాబా, కాకా, ఏరుచ్, జాల్ కేరావాలా, గుస్తాద్‌జీలు తిరుచునాపల్లి ద్వారా ఇక్కడే యూసుఫ్ అనే మస్తును కలిసికొనినది- తిన్నగా నాగపట్నం చేరుకొనిరి. ఆఖరు భాగము ప్రయాణములో, వరదలు తగ్గినవప్పటికి రైలుమార్గం ఇంకా మరమ్మతు కాకపోవుటవలన, టాక్సీలో వెళ్ళవలసి వచ్చినది. అట్టే యిబ్బంది లేకుండానే మోతీబాబాను చూచుట జరిగినది. బాబా ఆయన పాదములు కడిగి, భుజింపజేసి, ఆయనతో నిశ్శబ్దంగా ఒక హోటలులో కొంతసేపు కూర్చొనిరి. ఆ హోటలులోనే వారికి కావలసిన ఆహారపదార్థములు తయారు చేయించుకొనిరి.

వైభవోపేతుడయిన వృద్ధ చట్టిబాబా మాత్రము అంత సులభముగా దివ్యగురువుల వలలో పడలేదు. అతనికొరకు పంపబడిన వారు ఎంతోనయమున, ఎంతో ఓర్పుతో అతనికి నచ్చ జెప్పుటవలన బాబా సన్నిధానమునకు తీసికొని రాబడెను ఉన్నత





బాబా జన్మదినోత్సవాల ముగింపు సందర్భంగా కోఠి సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రేమికులు

స్థాయినందున్న సాధువులు సామాన్యజనుల స్తోత్రములకుగాని, లాలింపులకుగాని వారి పిలుపులకుగాని లొంగిపోరు. చిరకామునుంచియున్న వారి నివాసము అభ్యాసములయిన వారి పరిసరములను వదలి, అంతకన్న ఎక్కున ఆధ్యాత్మిక శక్తి యొక్క ప్రోద్బలము వలనగాని, బయటకురాలేరు. ఇట్టి గొప్ప ఆధ్యాత్మిక శక్తులు రెండిటిమధ్య కలిగిన సంఘర్షణము చట్టిబాబాకు బాబాతో కలిగిన సంబంధమునందు వారి నివాసమునందు వారి రెండుసంవత్సరముల సాంగత్యమునందు చక్కగా కనుపడెను

నాగపట్నమునకు అయిదుమైళ్ల దూరములో చట్టిబాబా ఉన్న ప్రదేశమునకు బాబా శిష్యులలో ముగ్గురు రెండు టాక్సీలలో వెళ్ళిరి. ఆతడు మొదట కారులో కూర్చొనుటకు ససేమిరా యనెను. వారిని వదలి తన చట్టి మూట పట్టుకొని తనకు ఆలసట కలిగేవరకు ముందుకునడచి రోడ్డుప్రక్కన కూర్చొనెను. మరల వారు సున్నితంగా మృదువుగా అతనిని కొంచెంసేపు వారితో రావలసినదని బ్రతిమలాడగా ఎట్టకేలకు ఒప్పుకొని ఒక టాక్సీలోవచ్చి కూర్చొనగా హోటలుకు తీసికొని వచ్చి వెంటనే చట్టిబాబాకు భోజనము పెట్టిరి. (సశేషం)

# అవతార్ మెహెర్‌బాబా
## 114వ జన్మ దినోత్సవ వేడుకలు

**మెహెర్‌బాబా 114వ జన్మ దినోత్సవ వేడుకలు తెలుగువారు తమ ప్రాంతాల్లో ఎంతో ఘనంగా జరుపుకున్నామని సమాచారం పంపారు. మార్చి 12 వరకు మాకందిన ఆ సమాచార వివరాలు ఇలావున్నాయి.**

## హైదరాబాద్

హైదరాబాద్‌లోని కోఠి, జూబ్లీ సెంటర్‌లలో అవతారుని జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జూబ్లీ హిల్స్ సెంటర్‌లో తెల్లవారుఝామున 4.30 నుండి అవతారుని చిత్రపటంతో ఊరేగింపుగా నామ్‌ధున్ చేసారు. అనంతరం మౌనం పాటించి సరిగ్గా 5 గం॥లకు "అవతార్ మెహెర్‌బాబాకీ" జై అని ఏడుసార్లు ప్రకటించి మౌనం ముగించారు. అనంతరం తెలుగు, ఇంగ్లీషుల్లో ప్రార్థనలు హారతి జరిగాయి. శ్రీ ఎన్. మహేశ్వర్‌రావు ప్రార్థనలు చేసారు. శ్రీ యం. మల్లికార్జున్‌రావు సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పతాక విశిష్టతను క్లుప్తంగా వివరించారు. అనంతరం శ్రీ రంగారావు, శ్రీ చిమన్‌లాల్ ధుని ప్రజ్వలన చేశారు. ఆ తర్వాత శ్రీ బి.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో అవతారుని సహవాస్, 1958 నాటి మెహెరాబాద్ సహవాస్‌పై వీడియో చిత్ర ప్రదర్శన, బాలల నృత్యం, మహిళలచే కనువిప్పు నాటిక, అవతారుని సందేశాలపై చిన్నారుల లఘునాటికలు ప్రదర్శించారు. ఆనాటి సాయంత్రం కోఠి సెంటర్ ప్రాంగణంలో పలువురు ప్రేమికులచే సంకీర్తన, బాలల నృత్యప్రదర్శన, గోపాలకృష్ణ బృందంచే మెహెర్‌బాబా అమితంగా ఇష్టపడిన పలు ఘజల్సు, కవ్వాలిలు ఉర్దూలో ఆలాపించారు. శ్రీ వి.ఆర్.కె.బాలాజీ ఉర్దూలోని ఘజల్సుకు తెలుగు అనువాదం చదివి వినిపించారు. మార్చి 2వ తేదిన కోఠి సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 65 మంది ఈ శిబిరంలో పాల్గొన్నారని, శ్రీ తోట నాగేశ్వర్‌రావు తెలిపారు.

### కరీంనగర్ సెంటర్, సాయినగర్

అవతార్ మెహెర్‌బాబా సెంటర్ ఛారిటబుల్ ట్రస్ట్, సాయినగర్, కరీంనగర్ ఆధ్వర్యంలో బాబా ప్రేమికులు ప్రతి రోజు రాత్రి 7.00 గం॥ నుండి 9.00 గం॥ వరకు బాబా 114వ జన్మదిన వేడుకలు వాడ వాడలా బాబా ప్రేమికుల నివాస గృహములో 1.2.2008 నుండి 25.02.08 వరకు ఎంతో ఘనంగా జరుపుకున్నారు.





బాబా జన్మదినము అయిన 25.02.08 రోజున సాయినగర్‌లోని మెహెర్‌బాబా సెంటర్ భవనములో ఉ॥ 4.00 నుండి 7.00 గం॥ వరకు బాబా జన్మ దిన ప్రత్యేక భజనలు జరిగినవి. సాయంత్రం "బ్రహ్మాండమైన ఊరేగింపు" బాబా రథమును గౌ॥ శ్రీ డి. శంకర్, మేయర్, నగరపాలక సంస్థ, కరీంనగర్, ముందుండి నడిపించారు.

శ్రీ సనక సనంద సరస్వతి స్వామీజీ, కొత్తపల్లి, బాబా ధుని వెలిగించినారు. నగర కార్పోరేటర్ శ్రీమతి రావికంటి భాగ్యలక్ష్మి, ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ (ఆర్.డబ్ల్యు.ఎస్), శ్రీ జె.విశ్వనాథ్, శ్రీ ఎస్. భూపతి, డి.ఎస్.పి. (ఇంటెలిజెన్స్), సెక్రటరీ, జిల్లా గ్రంధాలయసంస్థ, కట్ల మార్కండేయ, కె. రాంరెడ్డి, కె.శ్రీనివాసరావు, కేంద్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ సెంటర్, మెహెర్‌నగర్

బాబాగారి 114వ జన్మదిన వేడుకల సందర్భంగా ఫిబ్రవరి 24న సాయంత్రము 6.30 ని॥ల నుండి 9.00 వరకు బాబా నామ సంకీర్తనలు మరియు ఉపన్యాసములు ఏర్పాటు చేసితిమి. ముఖ్య అతిథులుగా శ్రీ బి.రామక్రిష్ణయ్య, (హైదరాబాద్), శ్రీ కాంతారెడి, (సంగారెడ్డి), హాజరయినారు. ఉ॥ 4.30 ని॥ల నుండి 5.00 గం॥ల వరకు "సచ్చితానంద పరమానంద మెహెర్ బాబా విజ్ఞానంద" నామ సంకీర్తలు, బాబా ప్రార్థన మరియు హారతి, (బాబాగారు పుట్టిన సమయం) అవతార్ మెహెర్‌బాబాకీ జే జేకార్. సో॥ శ్రీ జి.గుండేరావు, అధ్యక్షులు చేత బాబా బర్త్‌డే కేక్ కట్ చేయుట జరిగింది.

ఫిబ్రవరి 25న, ఉ॥ 7 గంటలకు శ్రీ పుష్పలత-రాంరెడ్డి గార్ల చేత ధుని వెలిగించడమైంది. ఉ॥ 7.10 ని॥ బాబా సప్తవర్ణ పతక ఆవిష్కరణ చేసారు.

### రేవడిలో

రేవడిలో బాబావారి 114వ జన్మదినోత్సవములు దివ్యసనాతనుడు, అవతార్ మెహెర్‌బాబా వారి 114వ జన్మదినోత్సవం ప్రపంచమంతా జరుపుకొను సందర్భమున 25.02.08 (సోమవారం) అవతార్ మెహెర్‌బాబా రేవిడి సెంటర్ ప్రారంభించినామని, ఈ కార్యక్రమమునకు శ్రీ బి.వెంకటరమణమూర్తిరాజు, (రేవడి), శ్రీ సి.జి. శర్మ (విశాఖపట్నం) ఆహ్వానించినామని ఒక లేఖలో తెలిపారు.

### తాడేపల్లిగూడెం

25.02.08 సోమవారం తెల్లవారు ఝూమున గం॥4.30 ని॥ల నుండి రాత్రి గం.9.45 ని॥ల వరకు రామారావు పేటలో, కరణాల సత్రం ఎదురుగా వున్న అవతార్ మెహెర్‌బాబా కేంద్రమునందు అవతార్ మెహెర్‌బాబా వారి 114వ జన్మదినోత్సవ

కార్యక్రమములు ఘనంగా నిర్వహించిన్నట్లు డా॥ వై.విజయసారథి, కేంద్ర అధ్యక్షులు తెలిపారు.

ఈ కార్యక్రమములో ఉ॥4.30 గం॥లకు బాబావారి చిత్రపటమునకు పుష్పమాలా లంకరణ శ్రీ వి.ఎస్.ఆర్.సి.హెచ్.వి.కె. సత్యనారాయణమూర్తి (బాబ్జి), శ్రీమతి భ్రమరాంబ మంగతాయారు దంపతులు (నిడదవోలు), శ్రీ నాళం మధురబాబు, శ్రీమతి విజయలక్ష్మి దంపతులచే (హైదరాబాద్)చే, అవతార్ మెహెర్‌బాబా 114వ జన్మదిన సంకేతముగా 114 జ్యోతులు (క్యాండిల్స్) వెలిగించుట, మెహర్‌నామం 4.50 ని॥ల నుండి 5.00గం॥ల వరకు, హారతి ఉ॥ 5.00 గం॥ల నుండి 5.10 ని॥ల వరకు అవతార్ మెహెర్‌బాబా జన్మ ముహూర్తం, మౌనం ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు

## రాజమండ్రి

రాజమండ్రి సెంటర్ లో అవతార్ మెహెర్‌బాబా 114వ జన్మదినోత్స వేడుకలు ది.25.02.08 సోమవారం శ్రీ కోళ్ళ వీరాస్వామి కళ్యాణమండపం, టి.నగర్, రాజమండ్రిలో బాబా ప్రేమికులచే సంకీర్తనలు, మెహెర్‌బాబా సత్యప్రేమ సందేశములపై ఉపన్యాసములు నిర్వహిస్తునట్లు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలనాగు బలేష్ గుప్తా గారు, అధ్యక్షులు, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ లి., వారిచే 2.3.2008 ఆదివారము ఉదయం గం॥ 9.30 ని॥ నుండి రాజు న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, గాంధీపురం, రాజమండ్రి నందు రక్తదాన సహవాస్ కె. రామకృష్ణ మెహెర్ (ఫోన్-2445199, 9849631507) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ, మహేష్ కుమార్ తెలిపారు.

## చింతపల్లిలో

శ్రీ అవతార్ మెహెర్‌బాబా వారి 114 జన్మదినోత్సవం సందర్భంగా చింతపల్లి, మెహెర్‌బాబా సెంటర్‌లో ఉదయం 4.45 ని॥లకు సుప్రభాతము, గం॥ 5.05 ని॥లకు హారతి 5.30 గం॥ల నుండి పూజలు సంకీర్తనలు, సాయంత్రం 4 గం॥ నుండి 8 గం॥ల వరకు భజన, సంకీర్తన, హారతి నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## గుంటూరులో

అవతార్ మెహెర్‌బాబా 114 జన్మదిన మహోత్సవముల సందర్భంగా అవతార్ మెహెర్‌బాబా గుంటూరు సెంటరువారిచే అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవములు





ది.20.02.08 బుధవారం నుండి ది.1.03.08 శనివారము వరకు 11 రోజులు పలువురు బాబా ప్రేమికుల గృహములలో మెహెర్‌బాబా సంకీర్తనలు, ప్రార్థనలు, మౌనము, ఉపన్యాసములు, హారతి మొదలగు కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమాలలో శ్రీమతి.కె.ఆదిలక్ష్మీ, శ్రీ జి. పేరయ్య, వంగర వెంకటాచలం, శ్రీ ఏకా మెహెర్ ప్రసాద్, శ్రీ తవ్వా హరగోపాల్, శ్రీ దూపుగుంట్ల రంగబాబు, శ్రీమతి ఇంకొల్లు జ్ఞాన ప్రసూనాంబ, శ్రీ ఊటుకూరి జనార్ధనగుప్త, శ్రీ కె.కోటేశ్వరరావు, శ్రీ యం. వెంకటేశ్వరరావు, తదితరులు గృహాలలో ప్రత్యేక సత్సంగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సిరిసిల్ల సెంటర్‌లో

అవతార్ మెహెర్‌బాబా వారి 114 జన్మదినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు మెహెర్‌ధూన్, బాబా జనన కాల హారతి, బాబా జన్మదిన కేక్ కటింగ్, బాబా ప్రార్థనలు సంకీర్తనలు, సందేశములు, నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకావిష్కరణ, ఊరేగింపు, బాబా ఫిలిం షో నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమంలో మద్ది నర్సయ్య, సామల ఎల్లయ్య, బద్దెపురి బాలయ్య, కమతాల విశ్వేశం, నార్ల విఠల్, కూన వైకుంఠం, మంచాల శ్రీనివాస్, శ్రీ తోట వైకుంఠం, శ్రీ పసుపులేటి మెహెరానంద్, శ్రీ మాన్య నారాయణ, శ్రీ యస్. రాజమల్లయ్య పాల్గొంటున్నట్లు ఆహ్వానం పంపారు.

## కొవ్వూరులో

మెహెరస్థాన్ 45వ వార్షికోత్సవము, మెహెర్‌స్థాన్ ధర్మశాల 2వ అంతస్థులో నూతనంగా నిర్మించబడిన రెండు హాల్స్ ప్రారంభోత్సవకార్యక్రమము ఘనంగా జరిగిందని కార్యదర్శి శ్రీ వై.యస్.రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరస్థాన్ ధర్మశాలలో చేపట్టిన రెండు హాలుల నిర్మాణం కోసం సుమారు ఐదున్నర లక్షల రూపాయలకు పైగా ఖర్చుకాగా, విశాఖపట్నంకు చెందిన శ్రీ వి. కృష్ణ ప్రసాద్ రూ.1.5 లక్షలు విరాళంగా ఇచ్చారని, అలాగే శ్రీ కె.హెచ్.కె ప్రసాద్ రెండు లక్షల మేరకు నగదు సమకూర్చారని కార్యదర్శి శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## నరసన్నపేటలో

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో బాబా 114వ జన్మదినోత్సవ కార్యక్రమాలు వివిధ బాబా ప్రేమికుల గృహములందు మరియు, అంపలాం, పోలాకి, గ్రామాలందు నిర్వహించగా ఫిబ్రవరి 25న ఉ॥ 5.00 గం॥ ప్రాతః కాల ప్రార్థనలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల రోగులకు, సబ్ జైలు ఖైదీలకు పండ్లు,బిస్కట్స్ వృద్ధాశ్రమంలోని 18 మందికి

మధ్యాహ్నభోజనంతో పాటు బాబా నామం జరిగింది. సిటీ కేబుల్‌లో బాబా వారి చిత్రాన్ని ప్రదర్శించడం జరిగిందని శ్రీ సూర్యం, సెక్రటరీ తెలిపారు.

### అనకాపల్లిలో

విశాఖపట్నం జిల్లా, అనకాపల్లిలో అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో అవతార్ మెహెర్‌బాబా 114వ జన్మదిన వేడుకలు కడు రమ్యముగా జరిగింది. ఉదయం 5 గంటలకు ప్రార్థనలు, హారతితో ప్రారంభమై, బాబాను అనకాపల్లి పురవీధులలో ఊరేగింపుగా తీసుకు వెళ్ళి లెప్రసీ రోగులకు సెంటరు ప్రెసిడెంట్ శ్రీ గంగుపాం నాగేశ్వరావు, శ్రీ బి.యన్.సింగ్ (కార్యదర్శి) బట్టలు, రొట్టెలు పంపిణీ చేసినారు. తదుపరి ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పంచారు. శివయ్య గారు బార్ కౌన్సిల్ ప్రెసిడెంటు మెహెర్‌బాబా విశిష్టత గురించి ప్రసంగించారు.

### అవతార్ మెహెర్‌బాబా ప్రేమాశ్రమం ట్రస్టు

అవతార్ మెహెర్‌బాబా ప్రేమాశ్రమం ట్రస్టు మెహెర్‌బాబా జన్మదినం సందర్భంగా స్కూలు విద్యార్థులు, మెహెర్‌బాబా నాటికలు డాన్సులు చాల చక్కగా ప్రదర్శించారు. టీచర్లకు, సిబ్బందికి ట్రస్టు వారు దుస్తులు, పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నాగరాజుగారు G.M, BSNL, Prof. T.Shivaji Rao, Former Principal AU Engg. College, Director for Environmental studies GITAM , C.G. Sarma, L.V.R.Murthy, I.RamaRao, Trust Secretary, B.Narasimha Murthy, Vice Chairman తదితరులు పాల్గొన్నారు.

### రాజాంలో

అవతార్‌మెహెర్‌బాబా 114వ జన్మదినోత్సవాలను ఫిబ్రవరి 7 నుండి 24 వరకు రాజాం పట్టణంలో ఒక్కొక ఇంటిలో అవతారుని సత్సంగ్ నిర్వహించామని కార్యదర్శి రమణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి 25న తెల్లవారు ఝామున 4 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని ఆయన అన్నారు. ఉదయం 6.30 నుండి 7.30 వరకు నగర సంకీర్తన అవతారుని చిత్ర పటంతోఊరేగింపు నిర్వహించామని అన్నారు. స్థానిక ఎల్.ఐ.సి. బ్రాంచి మేనేజర్ శ్రీ ఎస్.ఎన్.సాహు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారని, సప్తవర్ణపతాకం ఎగురవేసి ప్రసంగించారని రమణమూర్తి తెలిపారు.





**మా మాటలు**

## పుస్తక సమీక్ష
# వేల్పులవారి గేయ సుమమాలిక

శ్రీ వేల్పుల నిరాకారరావు మెహెర్ హృదయము, నీ గుణగానము శీర్షికన గేయ సుమమాలిక 39వ అమరతిథి సందర్భంగా ప్రచురించారు. మెహెరుని గుణగానములతో పాటు అవతారుని ప్రార్థనలు ప్రభుస్తుతి, మండలి ప్రార్థన, పశ్చాత్తాప ప్రార్థన, నావాంఛితము మెహెరుని మౌన ప్రేమ శంఖారావము. భగవంతుని ప్రేమించుట ఎట్లు? నిజమైన మతము, దివినుండి భువికి ఇలా పలు అంశాలు కూడా ఈ చిన్ని పుస్తకంలో ప్రేమికులందరికీ అనువుగా చోటు చేసుకున్నాయి. బాలగోపాల భాస్కరరాజు గారి ఈ గేయాలకు అందరికీ వీలైన అనువైన సంగీత బాణిని సమకూర్చారు. ఆయన 'నామాటగా' లోపలి పేజీల్లో నిరాకరావు గారి గేయరచనను, గేయరచయితగా ఆయన్ని కొనియాడారు.

కాగా, ఈ పుస్తక ప్రతులకోసం అవతార్ మెహెర్‌బాబా కోఠి సెంటర్, హైదరాబాద్ లోను లేదా, రచయిత ఫోన్– 98666–59857, మెహెర్‌వాణి, 9949753398, కరుణాకర్– 09819277180 సంప్రదించగలరు. వెల– అమూల్యమే అయివుంటుంది. పుస్తక ప్రతి వెల పేర్కొనలేదు.

---

### "మక్కా– కాబా" కథాంశాలపై స్పందన

తోటి మనిషికి కష్టాలలో సహాయపడితే నన్ను చేరినట్లే.

కష్టములో ఆదుకోవాలి, ప్రేమతో వ్యవహరించాలి ఇవి భగవంతునికి ఇష్టమైనవి.

తోటి మనిషికి సహాయముచేయకుండా కష్టములో ఆదుకోకుండా భగవంతుని దర్శనమునకు వెళ్ళితే వచ్చే పుణ్యముకంటే, కష్టములో ఉన్న వారిని ఆదుకుంటే భగవంతునికి ఇష్టమవుతుంది. ***–పి.ప్రభావతి, కదిరి,***

### పెండ్లిపిలుపు

శ్రీమతి సి. సావిత్రమ్మ& శ్రీ సి. రామక్రిష్ణగుప్త, గణేష్‌నగర్, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్, అనంతపురం గారి కనిష్ట పుత్రిక చి॥కుం॥సౌ॥ నాగమణి వివాహము చి॥విజయ చంద్రమౌళితో తేది 24.02.08 ఉ॥ 10.20 ని॥లకు జరుపుతున్నట్లు ఉదయం గం॥ 11.30 ని॥కు ఆహ్వానం పంపారు.

## పెండ్లిపిలుపు

శ్రీమతి & శ్రీ ప్రాత వెంకటరమణమూర్తి రాజాం, రిటైర్డ్ డి.టి.ఒ. గారి ఏకైక పుత్రుడు చి॥ వెంకట శ్రీనివాసరావు, వివాహము చి॥సౌ॥ మాధవీలతతో అరసవెల్లి (శ్రీకాకుళం) గంగురామన్న కళ్యాణమండపం నందు వివాహం తేది 14.03.08 శుక్రవారం రాత్రి గం॥ 9.54 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

## వివాహం

అవతార్ మెహెర్‌బాబా సెంటర్ నర్సరావుపేట మేనేజర్ క్రిష్ణమూర్తి మనుమరాలు చి॥ల॥సౌ॥ లక్ష్మీ ప్రసన్న ది. 23.02.08 నల్లపాటి వారి సప్తపది కళ్యాణమండపమునందు విజయ్‌కుమార్‌తో వివాహము జరిగినది. అవతార్ మెహెర్‌బాబా సెంటర్ ప్రేమికులందరూ హజరయ్యారు. కేశవరావుగారు, ముటుకూరు నుంచి యాగంటి సుబ్బయ్య గారు, ఆర్.సత్యావతి, అన్నా వెంకటేశ్వర్లుగారు, కాకుమాను నరసింహారావు గారు, వంకాయల అత్యుతరావు తదితరులు హాజరయ్యారు.

## నర్సరావుపేటలో

అవతార్ మెహెర్‌బాబా సెంటర్, నర్సరావుపేటలో 4.11.2007 నుండి 25.2.2008 వరకు 114 రోజులు మెహెర్‌బాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఒక్కొక్కరోజు ఒక్కొక్క ప్రేమికుని ఇంట్లో 114 రోజులలో 114 మంది గృహాలలో అవతారుని సత్సంగ్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఒక ప్రత్యేకత గల నర్సరావ్‌పేట సెంటర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25న తెల్లవారు ఝామున 4 గం॥ నుండి సాయంత్రం వరకు అవతారుని అనేక కార్యక్రమాలు ఉత్సాహంగా ఎంతో వేడుకగా ఒక పండుగ వాతావరణంలో జరిగాయి. సాయంత్రం 6 నుండి 9 వరకు బాబా చిత్రపటంతో నగరంలో నలువీధులా ఊరేగింపు, హారతితో కార్యక్రమాలు ముగిసాయి. పేదలకు, రోగులకు అన్నదానం, పండ్లు పంపిణి జరిగిందని కార్యదర్శి యం.వి.కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## గోదావరిఖని

అవతార్ మెహెర్‌బాబా సెంటర్, గోదావరిఖనిలో అవతారుని జన్మదినోత్సవాలు కడురమ్యంగా జరిగాయి. శ్రీ మాతంగి నర్సయ్య, మాజీ రాష్ట్ర మంత్రివర్యులు, శ్రీ రాజబాబు, శ్రీ టి.గోపాల రావు, వైస్ చైర్మన్, స్థానిక మునిసిపాలిటి, శ్రీమతి టి. విజయలక్ష్మి, వార్డు మెంబర్, శ్రీ యం. రాజారావు, శ్రీ వి.రాంమోహన్‌రావు తదితరుల ఆధ్వర్యంలో, అవతారుని చిత్రపటంతో ఊరేగింపు, ధుని వెలిగింపు అన్నదానం, వికాలాంగులకు వస్త్రదానం ఇలా పలు విశేష కార్యక్రమాలతో అవతారుని జన్మదిన వేడుకలు ఘనంగా ఒక పండుగ వాతవరణంలో ముగిసాయి.





# మెహెర్‌బాబా శతకము

**- సామల రాజమల్లయ్య (సిరిసిల్ల)**

సీ॥ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడవై
అవతరించుచు నుందువప్పుడపుడు
సకల లోకములేలు సమ్రాట్టువై యుండి
భక్త జనులకెల్ల బంటువగుదు (క్ష)
సకల చరాచర సంరక్షకుండవై
సాక్షాత్కరింతువు జగమునందు
ప్రేమైక మూర్తివై ప్రేమ బీజాలను
మాయెద వాటేవు మౌనముగను
ఆస్తి నాస్తి యనెడు వాదమంతరింప
ఇమ్ము ప్రియ తమా! నీదర్శనమిమ్ము నమ్మిమాకు
మధురమంజుల మోహన! మౌనభాష!
స్నిగ్ధ దరాహాస! మెహెరుబా! చిద్విలాస! -సశేషం

## నర్సన్నపేట సెంటర్ ప్రారంభోత్సవం

అవతార్ మెహెర్‌బాబా సెంటర్, నర్సన్నపేట సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో సుమారు 10 లక్షల రూపాయల అంచనాలతో జాతీయ రహదారి ఒక ప్రక్కగా అన్ని హంగులతో అవతారుని ప్రార్థనా మందిరం స్థానికులు నిర్మించుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైనారు. శ్రీ బాలగోపాల భాస్కరరాజు, తాడేపల్లి గూడెం ఈ భవన ప్రాంగణానాన్ని ఏప్రిల్ 20 ఉదయం 7 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారని స్థానిక సెంటర్ కార్యదర్శి శ్రీ సూర్యం తెలిపారు. ఏప్రిల్ 19న పెద్ద ఎత్తున అవతారుని ఊరేగింపుతో సహవాస్ కార్యక్రమం ఏర్పాటుచేసినామని, బాబా ప్రేమికులందరూ వీలుచేసుకుని తప్పక హాజరు కావల్సిందిగా శ్రీ సూర్యం కోరారు. రాబోయే ప్రేమికులందరూ తగిన ఏర్పాట్ల నిమిత్తం తమ వివరాలను శ్రీమతి వై. శాంతిలక్ష్మి, ఫోన్. 9247005677 తెలియజేయవలసింది

శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌కు వెళ్ళెముందు ఆముదాలవలస రైల్వేస్టేషన్‌లో దిగి జాతీయ రహదారికి ఒక ప్రక్కగా సత్యపురం జంక్షన్ (సుమారు 18 కి.మీ. ఆముదాలవలస నుండి) ప్రక్కనే అవతారుని ఆలయం ఉంది.

## వెయ్యి రూపాయలు - జీవిత సభ్యత్వం
## 2008 మార్చి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | తేది | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | 00.03.2008 | శ్రీ పి.సత్యనారాయణ, సత్రంపాడు, ఏలూరు | రు. 1000.00 |
| 2. | 00.03.2008 | అవతార్ మెహెర్‌బాబా సెంటర్, పాలకొండ | రు. 1000.00 |
| 3. | 00.03.2008 | శ్రీ పి.మోహన్‌రావ్, విశాఖపట్నం | రు. 1000.00 |
| 4. | 00.03.2008 | శ్రీ వి.వి సంగమేశ్వరరావు, విశాఖపట్నం | రు. 1000.00 |
| 5. | 00.03.2008 | శ్రీ జి. తిరుపతి నాయుడు, విశాఖపట్నం | రు. 500.00 |
| 6 | 00.03.2008 | శ్రీ వి. ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ | రు. 500.00 |
| 7 | 00.03.2008 | శ్రీ క్రాంతి మెహెర్‌జెల్లా, హైదరాబాద్ | రు. 1000.00 |
| 8 | 00.03.2008 | శ్రీ వి. కరుణాకర్ రావు, ముంబాయి | రు. 1000.00 |
| 9. | 00.03.2008 | మెహెర్ మణి. కె, సికింద్రాబాద్, | రు. 1000.00 |
| 10. | 00.03.2008 | శ్రీ వడ్డి గోపాలరావు, విజయనగరం | రు. 500.00 |
| 11. | 00.03.2008 | ఎస్.ఎస్.లక్ష్మీ, హైదరాబాద్, | రు. 1000.00 |
| 12. | 00.03.2008 | టి.వి.ఎన్.బి. రాజు, తాడేపల్లిగూడెం. | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు. 10,000.00** |

## జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. ఏదేని కారణాలచేత మీరు చెల్లించిన జీవిత సభ్యత్వం వాపసు కోరిన ఎడల తక్షణమే వడ్డీ లేకుండా తిరిగి పంపగలమని హామీ.
4. వార్షిక సభ్యత్వం రూ. 100/-
5. మీరు పంపే నగదు పోస్టలు మనీ ఆర్డర్ ద్వారా పంపితే ఉభయకుశలోపరి. మీకు పోస్టలు శాఖవారి రశీదు లభిస్తుంది.

**బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు. మా అడ్రస్సు- ఎడిటర్, మెహెర్‌బాబా, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500 087 -040-27860079, మొబైల్- 99595-53218.**





## ప్రభుస్తుతి

### ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోశకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వావు.
గంభీరుడవు,
గుణములు లేని వాడవు,
నీవు అపరిమితుడవు,
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేనివాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతట గలవు,
నీవు అన్నింట నున్నావు
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడులోకములలోనున్నానవు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయలను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురామజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.